వరప్రదాయిని నమోస్తుతే..

జిల్లాలో అమ్మవారి ఆలయాలు శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు అయ్యాయి. పలు చోట్ల దీపాలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు. నేటి నుంచి శక్తిస్వరూపిణిని వివిధ రూపాల్లో అలకరించి ప్రత్యేక పూజలు చేయనున్నారు.

-న్యూస్‌టుడే, అనంత సాంస్కృతికం


విద్యుత్తు కాంతుల్లో శివకోటి ఆలయం


కొత్తూరు అమ్మవారిశాల


పాతూరు రేణుకాఎల్లమ్మ

గ్రామ స్వరాజ్యమే లక్ష్యం

స్వచ్ఛతా హీ సేవలో ప్రజాప్రతినిధులు, అధికారులు

అనంతపురం(కళ్యాణదుర్గంరోడ్డు), న్యూస్‌టుడే : గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన సాగుతోందని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే పరిటాల సునీత పునరుద్ఘాటించారు. అభివృద్ధి, సంక్షేమం ఎంత ముఖ్యమో, పరిశుభ్రతకు అంతే ముఖ్యమన్నారు. 'స్వచ్ఛ భారత్ దివస్- స్వచ్ఛతా హీసేవ' కార్యక్రమంలో భాగంగా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం అనంతపురం గ్రామీణం కక్కలపల్లికాలనీ పంచాయతీలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో ముగింపు సభ నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్, స్వచ్ఛంద్రాప్రదేశ్‌గా నిర్మించుకోవాలని దేశ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమన్నారు. అందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలంతా భాగస్వామ్యులు కావాలన్నారు.

- స్వచ్ఛతా హీసేవ కార్యక్రమంలో భాగంగా రెండు వారాలుగా అందరూ కలిసి పనిచేయడంతో రాష్ట్రస్థాయిలో జిల్లాకు తొలి అవార్డు దక్కిందని కలెక్టర్ తెలిపారు. ఇల్లు, పరిసరాలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, తదితర ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉంచడమే మనందరి బాధ్యత అన్నారు. అనంతరం క్లాప్ మిత్రులకు అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. కుందుర్పి కస్తూరిబా పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన బొమ్మలు ప్రదర్శన అబ్బురపరిచింది


సన్మాన గ్రహీతలతో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, ఎమ్మెల్యే పరిటాల సునీత

భూకబ్జాదారుల్లో దడ




- గత వైకాపా ప్రభుత్వ 'ఫ్రీహోల్డ్'పై పునఃపరిశీలన
- ఐదోతేదీ నాటికి నిగ్గుతేలే అవకాశం

జిల్లా సచివాలయం, (న్యూస్‌టుడే): ఉమ్మడి అనంతపురం జిల్లాలో అసైన్డ్ భూముల బాగోతాన్ని నిగ్గుతేల్చడానికి యంత్రాంగం నడుం బిగించింది. ఈనెల 5వ తేదీలోపు నిర్ధారించేందుకు క్షేత్ర పరిశీలన ముమ్మరంగా నడుస్తోంది. గత వైకాపా ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రజాప్రతినిధులు, నాయకులు భూదందా సాగించిన సంగతి తెలిసిందే. చట్ట సవరణ ముసుగులో.. వేలాది ఎకరాలను 'నిషేధిత జాబితా' నుంచి తొలగించి.. ఆగమేఘాలపై అమ్ముకుని రూ. కోట్లు దిగమింగారు. పేదల జీవనాధరమైన అసైన్డ్ భూములను గుట్టుచప్పుడు కాకుండా అవినీతి అధికారులతో చేతులు కలిపి బినామీ పేర్లతో దోచుకున్నారు. వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్లూ భూదందా సాగించారు. ఇదే అదనుగా సార్వత్రిక ఎన్నికలకు మూడు మాసాల ముందు ఎడాపెడా అసైన్డ్/చుక్కల భూములను 22ఏ నిషేధి జాబితా(ఫ్రీ హోల్డ్) నుంచి విముక్తి కల్పించారు. గతేడాది డిసెంబరు 19న జీవో 596ను పేదల ప్రయోజనాల కోసమంటూ తెచ్చిన భూచట్ట సవరణను అధికార వైకాపా నేతలు అనుకూలంగా మలుచుకున్నారు. కనీసం 20ఏళ్లకుపైగా అసైన్డ్, వంక పోరంబోకు.. ఇలా ప్రభుత్వ భూమి డి.పట్టా ఆధారంగా సాగు చేసుకుంటున్న పేదలకు శాశ్వత భూయాజమాన్య హక్కులు కల్పిస్తామని దగా చేశారు. ఇందులో వైకాపా నేతలే భూకబ్జాలకు పాల్పడి రూ. కోట్లు లబ్ధి పొందారన్నది నిష్ఠూర సత్యం. ఈ అక్రమ బాగోతాన్ని తేల్చడానికి తెదేపా కూటమి ప్రభుత్వం పునఃపరిశీలనకు శ్రీకారం చుట్టింది.

'సత్యసాయి'లోనే అత్యధికం

నిషేధి జాబితా నుంచి విముక్తి పొందిన భూమి అత్యధికంగా శ్రీసత్యసాయి జిల్లాలోనే ఉండటం విశేషం. రాష్ట్రంలోనే ఈ జిల్లా రెండో స్థానంలో ఉంది. జిల్లా విభజన తర్వాత వైకాపా ప్రజాప్రతినిధులు ఇబ్బడిముబ్బడిగా తహసీల్దార్లను అడ్డుపెట్టుకుని వేలాది ఎకరాలు కొట్టేశారు. జిల్లాలో మొత్తం 1,92,174 ఎకరాలు నిషేధి జాబితా నుంచి తొలగించారు. ఇందులో 2,997 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవడం గమనార్హం. ఎక్కువగా ధర్మవరం, బత్తలపల్లి, హిందూపురం, సోమందేపల్లి, చిలమత్తూరు, కదిరి, గోరంట్ల, పెనుకొండ, ముదిగుబ్బ, పుట్టపర్తి మండలాలు ఉన్నాయి. తాజా పునఃపరిశీలనలో ఆయా ప్రాంతాల్లో లోతుగా ఆరా తీస్తున్నారు. జగన్ ప్రభుత్వంలో వైకాపా ఎమ్మెల్యేల్లో ఒకరు చేసిన భూకబ్జాలకు హద్దులేకుండా పోయింది. ఈయనతో అంటకాగిన ఓ తహసీల్దారు సైతం సస్పెండ్‌కు గురి కావాల్సి వచ్చింది. బినామీ పేర్లపై సదరు ఎమ్మెల్యే వేలాది ఎకరాలను కొట్టేశారు.



అనంతలో 30వేల ఎకరాలు..

అనంత జిల్లా పరిధిలో అసైన్డ్/చుక్కల భూమి 2,22,902 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ శాఖ తేల్చింది. వైకాపా పాలనలో 23,399 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించారు. ఇందులో 99.679 ఎకరాలు రిజిస్ట్రేషన్ అయినట్లు తేలింది. రిజిస్ట్రేషన్ అయిన ఫ్రీహోల్డ్ భూములే కాకుండా నిషేధిత జాబితా నుంచి తొలగించిన దానిపై పునఃపరిశీలన సాగుతోంది. మూడు రెవెన్యూ డివిజన్లల్లో ఎక్కువగా కళ్యాణదుర్గం పరిధిలోనే దందా సాగింది. ఇక్కడ 3203 మంది యజమానులకు చెందిన 12,393 ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించడంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అనంత డివిజన్‌లో 2083 మందికి చెందిన 9113 ఎకరాలు ఉంది. అనంత గ్రామీణం, రాప్తాడు, ఆత్మకూరు, కూడేరు, నార్పల, శింగనమల, బీకే సముద్రం, గార్లదిన్నె, కళ్యాణదుర్గం, గుత్తి, పామిడి.. వంటి ప్రాంతాల్లో ఎక్కువగా భూదందా నడిచినట్లు స్పష్టమవుతోంది.

అనంత జిల్లాలో డివిజన్ల వారీగా ఫ్రీహోల్డ్ భూమి వివరాలు

డివిజన్	గ్రామాలు	యజమానులు	ఎకరాలు
అనంతపురం	38	2,083	9,113.56
గుంతకల్లు	27	638	1,892.162
కళ్యాణదుర్గం	34	3,203	12,393.462

సి'ఫార్సు'లో దందా

చుక్కలు, అసైన్డ్ భూములు 22ఏ నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించాలంటే క్షేత్ర స్థాయి నుంచి దస్త్రాలు నిర్వహించాలి. వీఆర్‌ఓ, తహసీల్దారు, ఆర్డీఓ.. ఇలా దస్త్రాలు కలెక్టరేట్‌కు చేరాలి. క్షేత్ర స్థాయిలోని రెవెన్యూ అధికారులను లోబరుచుకుని కబ్జాదారులు పక్కా ప్రణాళికతో నడిపించారు. అక్కడి నుంచే సిఫార్సులు చేయించుకున్నారు. దళిత, గిరిజనుల వద్ద ఉన్న అసైన్డ్ భూముల డి.పట్టాలను భయపెట్టి.. బెదిరించి లాక్కున్నారు. అంతోఇంతో చేతికి ఇచ్చి పక్కకు తోసేశారు. దీనికి రెవెన్యూ యంత్రాంగం సహకరించింది. ఇదంతా పక్కా ప్రణాళికతో ముగించారు. ఇపుడు తెదేపా కూటమి ప్రభుత్వం ఈ తరహా భూములపై దృష్టి సారించింది. మదనపల్లి దస్త్రాల వ్యవహారం తెరపైకి వచ్చిన తర్వాత.. అసలు బాగోతం వెలుగుచూస్తోంది.

కమ్మేసిన కరవు ఛాయలు

- కీలక దశలో పంటలు ఎండుముఖం
- నష్టపోతున్న అన్నదాతలు

ఈనాడు, అనంతపురం

ఓ వైపు ఆకాశం మేఘావృతమై ఉంటున్నా.. చినుకులు పడటం లేదు. అధిక వర్షపాతం నమోదైనా.. పంటలకు అదును లేకుండా పోయింది. ఎంతో కీలకమైన సెప్టెంబరులో వర్షాభావంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేరుసెనగ, కంది, ఆముదం, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. పంట ఎదుగుదల నిలిచిపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. ఇప్పుడు వర్షాలు కురిసినా పంట చేతికందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది సరైన వర్షాలు లేకపోవడంతో ఉమ్మడి జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఫలితంగా బోర్లలోనూ నీరు తగ్గిపోయి.. వాటి కింద సాగు చేసిన పంటలు చాలా చోట్ల ఎండిపోయాయి. ఈ జిల్లా వేరుసెనగకు పెట్టింది పేరు. దిగుబడి సంగతి దేవుడెరుగు కనీసం పశుగ్రాసం వచ్చే అవకాశం లేదని కర్షకులు వాపోతున్నారు. పత్తిలో 40 శాతం దిగుబడి రావడం కష్టమే అంటున్నారు. కంది, ఆముదం పంటలదీ అదే పరిస్థితి. రెండేళ్లుగా ఇదే తీరు ఉండటంతో రైతులు సాగుపై ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్షలాది ఎకరాలు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి.

పశుగ్రాసమూ దక్కేలా లేదు..



అనంతపురం జిల్లా రాప్తాడు మండలం రామినేపల్లికి చెందిన ఆనంద్.. రెండు ఎకరాల్లో వేరుసెనగ సాగు చేశారు. ఆగస్టులో వర్షానికి పంట ఆశాజనకంగా ఎదిగింది. సెప్టెంబరులో కాయలు దిగే సమయానికి వర్షాలు లేక దిగుబడి పూర్తిగా పడిపోయింది. చెట్టుకు కనీసం నాలుగైదు కాయలు రాలేదు. విత్తనానికే రూ.12 వేలు, సాగుకు మరో 20 వేలు ఖర్చు చేసినట్లు ఆనంద్ చెబుతున్నారు. ప్రస్తుతం పంట ఎండుముఖం పట్టింది. పశుగ్రాసం కూడా దక్కే పరిస్థితి కనిపించడం లేదని వాపోతున్నారు.


రెండు బోర్లూ అడుగంటాయి



శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం చదుల వాండ్లపల్లి గ్రామానికి చెందిన రామ్మోహన్‌రెడ్డి 3.5 ఎకరాల్లో వరి సాగు చేశారు. పొలంలో రెండు బోర్లు ఉన్నాయి. రెండేళ్లుగా వర్షాలు లేకపోవడంతో రెండు బోర్లూ అడుగంటిపోయాయి. వాటికింద సాగుచేసిన వరి ఎండిపోయింది. ఎకరానికి రూ.30వేలు చొప్పున రూ.1.20 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు రామ్మోహన్‌రెడ్డి చెబుతున్నారు. ఇంటిల్లిపాది రెక్కల కష్టంతో సాగు చేసిన పంట కళ్లముందే ఎండిపోతుంటే కన్నీళ్లు ఆగడం లేదని వాపోతున్నారు.

వేరుసెనగ, పత్తిపై ప్రభావం

అనంతపురం జిల్లాకు సంబంధించి ఖరీఫ్‌లో 2.9 లక్షల ఎకరాల్లో వేరుసెనగ సాగైంది. పత్తి 72 వేల ఎకరాలు, 1.44 లక్షల ఎకరాల్లో కంది సాగు చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో వేరుసెనగ 96 వేల ఎకరాలు, కంది 23 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో సాధారణ వర్షపాతం నమోదైనప్పటికీ జులై, సెప్టెంబరు మాసాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జులైలో 62 శాతం, సెప్టెంబరులో 56 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్ చివరిలో విత్తుకున్న పంటలు సెప్టెంబరు నాటికి కాయ దశకు చేరుకుంటాయి. ఊరే సమయంలో వర్షాలు లేకపోవడంతో వేరుసెనగ, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. పత్తిలో 80 నుంచి 90 కాయలు ఉండాల్సి ఉండగా.. కనీసం 20 కాయలు రాలేదు. వేరుసెనగ చెట్టుకు 5 కాయలు కూడా కనిపించడం లేదు.



పడిపోయిన భూగర్భ జలాలు

ఉమ్మడి అనంత జిల్లాలో భూగర్భ జలాలు 12.26 మీటర్ల లోతుకు పడిపోయాయి. గతేడాది వర్షాలు లేకపోవడంతో బోర్లు రీఛార్జ్ కాలేదు. దీనికితోడు వైకాపా ఐదేళ్ల పాలనలో భూగర్భజలాల పెంపునకు కనీస చర్యలు తీసుకోలేదు. చెక్‌డ్యాంలు, నీటి కుంటలు, పంట కుంటల నిర్మాణంపై శ్రద్ధ చూపలేదు. హంద్రీనీవా నీటితో ఇక్కడి చెరువులు నింపకుండా... నేరుగా పుంగనూరు తీసుకెళ్లడంతో ఈ పరిస్థితి నెలకొందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బోర్ల కింద పంటలు సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. బోర్లల్లో నీరు తగ్గిపోవడంతో పంటలు నిలువునా ఎండిపోతున్నాయి. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం మారినా.. జగన్ ఫొటోలు మారలే..



విడపనకల్లు మండలం పెద్దకొట్టాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ పథకాలపై నేటికీ మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఫొటోలు దర్శనమిస్తున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు గడిచినా పీహెచ్‌సీ అధికారులు జగన్ ఫొటోలు ఉన్న ఫ్లెక్సీలు, స్టిక్కర్లను తొలగించలేదు. ఇక్కడి అధికారులు, సిబ్బంది వైకాపా ప్రభుత్వ హయాంలో నియమితులైన వారే కావడంతో, ఈ రకంగా జగన్‌పై తమ అభిమానాన్ని చాటుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లగా ఫొటోలు కనిపించకుండా స్టిక్కర్లు అతికిస్తామని చెప్పారు.

- న్యూస్‌టుడే, విడపనకల్లు (ఉరవకొండ)

పది రోజులు ముందుగానే సాగునీరు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : పది రోజుల ముందుగానే సాగునీరు విడుదల చేసినందుకు కెకె. అగ్రహారం రైతులు, తెదేపా నాయకులు హెచ్చెల్సీలో దిగి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ముఖ్యమంత్రి చంద్రబాబు, శింగనమల ఎమ్మెల్యే శ్రావణిశ్రీ చిత్రపటాలతో ర్యాలీగా వచ్చి, పాలాభిషేకం చేశారు. తెదేపా నాయకులు రాము మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు రాక పంటలు ఎండుతున్న తరుణంలో రైతులతో కలిసి ఎమ్మెల్యేకు సమస్యను వివరించామన్నారు. ఆమె స్పందించి ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి ముందుగానే నీరు విడుదల చేయించారన్నారు. ఎండుతున్న పంటలకు జీవం పోశారన్నారు. తెదేపా నాయకులు హరి, నారాయణస్వామి, చలపతి, మంజు, సంజప్ప, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


హెచ్చెల్సీలో ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే చిత్రపటంతో రైతులు, తెదేపా నాయకులు


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్

ఘనంగా ఖైదీల సంక్షేమ దినోత్సవం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: గాంధీ యంతి సందర్భంగా జిల్లా జైలు, ఖైదీల వ్యవసాయ క్షేత్రాల్లో బుధవారం ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ హాజరై ఖైదీలకు తన సందేశాన్ని వినిపించారు. మహాత్మా గాంధీ స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో జైలులో ఉన్నపుడు ఖైదీల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేశారని గుర్తు చేశారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. జైలు పర్యవేక్షకులు షఫీవుర్ రెహమాన్, చంద్రశేఖర్, న్యాయసేవా కార్యదర్శి శివప్రసాద్, జిల్లా వైద్యాధికారిణి దేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దీపావళికే.. వంటింట వెలుగులు


- ఉచితంగా మూడు సిలిండర్ల పంపిణీ
- పౌరసరఫరాల శాఖ కసరత్తు ప్రారంభం

అనంతపురం (కళ్యాణదుర్గం రోడ్డు), న్యూస్‌టుడే:

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో.. సూపర్ సిక్స్ పథకాలు అమలులో భాగంగా మహాశక్తి పథకం కింద పేదలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకాన్ని దీపావళి పండగ నుంచి అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ పథకం కింద ఏడాదికి మూడు సిలిండర్లు పంపిణీ చేయాలని హామీ ఇచ్చారు. ఆ దిశగా పౌర సరఫరాలశాఖ కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 12,54,911 గృహ వినియోగ వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో దీపం, ఉజ్వల పథకాల కింద, ఇతర ప్రభుత్వ పథకాల కింద తీసుకున్నవారిలో తెల్లకార్డుదారులకు ఈ పథకాన్ని వర్తింపజేస్తే 12,08,293 కార్డుదారులున్నారు. ఇప్పటికే పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణాల్లో ఉచిత గ్యాస్ పథకం అమలు చేస్తున్నారు. ఏడాదికి ఎంత ఖర్చవుతోంది? ఆయా రాష్ట్రాల్లో ఎలా అమలు చేస్తున్నారు? విధి విధానాలపై పౌర సరఫరాలశాఖ కసరత్తు చేసి నివేదిక సిద్ధం చేసింది. శాసనసభ కమిటీలో మంత్రులు కూడా చర్చించి నివేదించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి విధివిధానాలను వెల్లడించే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

✦ అంశం	: ఉచిత గ్యాస్ సిలిండర్లు
✦ గ్యాస్ ఏజెన్సీలు	: 87
✦ జనరల్ కనెక్షన్లు	: 7,48,218
✦ దీపం, ఉజ్వల పథకాలు	: 4,38,242
✦ ఇతర కంపెనీలవి	: 68,451





12.54 లక్షల కనెక్షన్లు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 12,54,911 వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. తెల్లకార్డుదారుల ప్రాతిపదికగా తీసుకుంటే ఇందులో 96 శాతం అంటే 12,08,293 కుటుంబాలకు అర్హత ఉంది. వీరందరికీ ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా ఇవ్వాలంటే రూ.105,06,10,763.50 ఖర్చవుతుంది.

ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.2,608

సూపర్ సిక్స్ హామీల అమల్లో భాగంగా ప్రతి ఇంటికి ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అనంతపురంలో తాజాగా ఒక్కో సిలిండరు ధర రూ.869.50 ఉంది. మూడు సిలిండర్ల లెక్కన ప్రస్తుతమున్న వంట గ్యాస్ ధర ప్రకారం ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.2,608.50 ప్రయోజనం కలుగుతుంది.

దీపం పథకం కింద..

మహిళలకు కట్టెల పొయ్యి నుంచి విముక్తి కలిగించేందుకు 1999లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నప్పుడే దీపం పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద ఉమ్మడి జిల్లాలో 4,09,764 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఒక్కో సిలిండర్‌కు రూ.869.50 చొప్పున ఏడాదికి రూ.35,62,89,798 భరించాల్సి ఉంటుంది. వీటితో పాటు సామాజిక బాధ్యత కింద ఇంధన కంపెనీలకు సంబంధించి 68,451 కనెక్షన్లు ఉన్నాయి. ఏడాదికి మూడింటికి రూ.5,95,18,144.50 వెచ్చించాల్సి ఉంది.

ప్రధానమంత్రి ఉజ్వల పథకం

ఈ పథకం కింద ఉమ్మడి జిల్లాలో 28,478 మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వం ఒక్కో సిలిండర్‌పై రూ.300 చొప్పున ఏడాదికి 12 సిలిండర్లకు రాయితీ ఇస్తోంది. అంటే వీరికి ఒక్కో సిలెండర్‌పై రూ.569.50 చొప్పున రాయితీ ఇవ్వాలి. మూడింటికి ఏడాదికి రూ.2,47,61,621 అవుతుంది.

ఈకేవైసీ వేగవంతం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్ల పంపిణీ ప్రకటించింది. ఆయా ఏజెన్సీల కింద ఉన్న వినియోగదారులకు డీలర్లు సమాచారం చేరవేశారు. గ్యాస్ ఏజెన్సీల వద్దకు ఆధార్ కార్డు తీసుకెళ్లి వేలిముద్ర వేయించుకుంటున్నారు. గ్యాస్ వినియోగదారులంతా ఈకేవైసీ చేసుకుంటే జిల్లాలో అసలైన గ్యాస్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయన్నది తెలుస్తుందని ప్రముఖ గ్యాస్ డీలరే చెప్పడం గమనార్హం.

బదిలీ ఉద్యోగులకు ఉత్తర్వులు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తు పరిధిలో పనిచేస్తున్న వివిధ విభాగాల ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఉత్తర్వులను బుధవారం అందజేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 40 మంది ఎంపీడీఓలకు బదిలీలు జరిగాయి. గురువారం విధుల్లోకి చేరాలని ఆదేశాలు జారీ చేశారు. 38 మంది ఏఓలు, 62 మంది సీనియర్ సహాయకులు, 107 మంది జూనియర్ సహాయకులు, 9 మంది ల్యాబ్ అసిస్టెంట్లు, పలువురు రికార్డు అసిస్టెంట్లు, అటెండర్లను బదిలీలు చేశారు. వాస్తవానికి బదిలీలు పదిరోజుల క్రితమే పూర్తయ్యాయి. ప్రభుత్వం గడువు పెంచడంతో ఉత్తర్వులు అందజేయలేదు.


చిత్రీకరణలో ఖదీర్‌అహ్మద్

లఘు చిత్రాలు తీసి.. వీక్షకులను మెప్పించి!

- సామాజిక అంశాలపై చిత్రీకరణ
- గుంతకల్లు కుర్రాడి ప్రత్యేకత

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : గుంతకల్లుకు చెందిన ఎస్‌. ఖదీర్‌ అహ్మద్‌ వెండితెర మీద ఆసక్తి పెంచుకున్నారు. దేశభక్తి, కుటుంబం, సామాజిక అంశాలపై లఘు చిత్రాల తీసి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. 'ఏ స్మాల్‌ డాట్‌ ఫిలిమ్స్‌' అనే యూట్యూబ్‌ ఛానల్‌ను ప్రారంభించారు. 2003లో డిగ్రీ పూర్తి చేసి హైదరాబాదుకు వెళ్లాడు. చిత్రపరిశ్రమలో అడుగుపెట్టి జూనియర్‌ ఆర్టిస్టుగా, సహాయ దర్శకుడిగా, స్టిల్‌ ఫొటో గ్రాఫర్‌గా, కెమెరామెన్‌గా పని చేశారు. వేదం, సింహా చిత్రాలకు సహాయ దర్శకుడిగా పని చేశారు. 2012లో హైదరాబాదు నుంచి గుంతకల్లుకు వచ్చిన తరువాత డైరెక్టర్‌గా కొన్ని లఘు చిత్రాలు తీశారు.

- జ్ఞాపకాలు, నాన్నకు అంకితం, దేశభక్తి, త్రివర్ణ పతాకం, మన దేశ పతాకం తదితర లఘు చిత్రాలు తీసి వీక్షకులను మెప్పించారు. ప్రస్తుతం బంధం షార్ట్‌ ఫిలిమ్స్‌ తీస్తున్నారు. దాదాపు 25 దాక లఘు చిత్రాలు తీశారు.

తక్కువ బడ్జెట్‌తో చిత్రం


తక్కువ బడ్జెట్‌లో అసాంఘిక కార్యక్రమాలను అరికట్టే అంశంపై వందమందితో కలిసి గుంతకల్లు కేంద్రంగా 'చోర్‌నోట్‌' చిత్రాన్ని తీశారు. గుంతకల్లు వాసవీ థియేటర్‌లో 20 రోజుల పాటు రోజుకు 4 ఆటలు ఆడించారు.


చోర్‌ నోట్‌ చిత్రాన్ని విడుదల చేస్తున్న ఖదీర్‌ అహమ్మద్‌, చిత్ర బృందం (పాతచిత్రం)

ఉన్నతంగా చదివి.. ఉత్తమ ర్యాంకులు సాధించి

ఐసీఏఆర్‌లో ఎన్‌జీ రంగా వ్యవసాయ ఇంజినీరింగ్‌ విద్యార్థుల ప్రతిభ





మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: మడకశిర ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బీటెక్‌ చివరి సంవత్సరం విద్యార్థులు ఎంటెక్‌లో ప్రవేశం కోసం జూన్‌ నెలలో జరిగిన(ఐసీఏఆర్‌, ఏఆర్‌ఎఫ్‌) జాతీయ స్థాయి ఆన్‌లైన్‌ ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. కళాశాలలో 10 మంది విద్యార్థులు జాతీయస్థాయిలో 100లోపు ర్యాంకులు సాధించి ప్రతిభను చాటారు. కళాశాల ఆచార్యుల ప్రోత్సాహం, మంచి ఉత్తీర్ణతకు అవసరమైన సలహాలు, సూచనలు ఉత్తమ ర్యాంకులు సాధించేందుకు సాధ్యమైందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించి అధిక లాభాలు సాధించేలా చూస్తా..



మా స్వగ్రామం సుంకిరెడ్డిపల్లి, మడకశిర మండలం. తల్లిదండ్రులు తిమ్మారెడ్డి, గీత. వ్యవసాయం పనులు చేస్తున్నారు. ఐసీఏఆర్‌ ప్రవేశపరీక్షలో 331 ర్యాంకు వచ్చింది. నీటి యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో అధికలాభాలు వచ్చేలా అధునాతన యంత్ర ఆవిష్కరణలు చేసి రైతులకు అందించి అభివృద్ధికి కృషి చేస్తా. రెండేళ్ల క్రితం చింత ప్రాసెసింగ్‌ యంత్రాన్ని తయారుచేసి రైతులకు అవగాహన కల్పించాం. త్వరలో రైతులకు అందుబాటులోకి తెస్తాం. **- ఇందు**

అన్నదాతలకు అండగా నిలుస్తా



మా స్వగ్రామం గుంతకల్లు. తల్లిదండ్రులు ఈరన్న, లలిత. డెయిరీ నిర్వహిస్తున్నారు. ఐసీఏఆర్‌లో 83వ ర్యాంక్‌ వచ్చింది. ఉమ్మడి జిల్లాలో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. ఎంటెక్‌ అనంతరం వ్యవసాయంలో రైతులకు ఉపయోగపడే కొత్త విత్తన వంగడాలు, తక్కువ పెట్టుబడితో మంచి లాభాలు సాధించేలా కృషి చేస్తా. **- లోకిత**

లాభసాటిగా మార్చేందుకు కృషి



మా స్వగ్రామం కర్నూలు. తల్లిదండ్రులు బాలమల్లయ్య, నాగమణి. ఐసీఏఆర్‌ ప్రవేశపరీక్షలో జాతీయస్థాయిలో 573వ ర్యాంకు సాధించాను. ఎంతో సంతోషంగా ఉంది. ప్రొఫెసర్ల మంచి విద్యాబోధన, ఎంటెక్‌లో ర్యాంకు సాధించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు. భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తగా ఎదిగి వ్యవసాయ రంగానికి సేవలందిస్తా. **- మంజునాథ్‌**

శాస్త్రవేత్తగా రాణిస్తా..



మా స్వగ్రామం నెల్లూరు. అమ్మానాన్న వెంకటరమణయ్య, ఆదిలక్ష్మి. మాది వ్యవసాయ కుటుంబం. ఐసీఏఆర్‌ ప్రవేశ పరీక్షల్లో జాతీయ స్థాయి 54వ ర్యాంకు వచ్చింది. ఎంతో సంతోషంగా ఉంది. నాలుగేళ్ల బీటెక్‌లో రైతుల పంట పొలాలను సందర్శించి వారి కష్టాలను చూశాం. పంటలకు చీడపీడలు సోకి తీవ్రంగా నష్టపోతున్నారు. ఎంటెక్‌ అనంతరం శాస్త్రవేత్తగా పంటలకు సోకే తెగుళ్ల నివారణకు మంచి మందులు కనుగొని మంచి దిగుబడులు సాధించేలా కృషి చేస్తా. **- సునీల్‌**

నాణ్యమైన బోధనతో ఉత్తమ ర్యాంకులు

కళాశాల ప్రొఫెసర్లు నాణ్యమైన బోధన అందించడం, విద్యార్థుల చదువులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వ్యవసాయ విద్యలో మంచి మెళకువలు నేర్పించారు. దీనికి తోడు అంత రాష్ట్ర ప్రముఖ వ్యవసాయ ఇంజినీరింగ్‌ శిక్షణ కేంద్రాల్లో నైపుణ్య శిక్షణ ఇప్పించడంతో విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి కళాశాలకు మంచి గుర్తింపు తీసుకువచ్చారు.

- సరోజినిదేవి, డీన్‌, వ్యవసాయ ఇంజినీరింగ్‌ కళాశాల

యోగా పోటీల్లో మహిళా పోలీసుకు కాంస్యం


కాంస్య పతక విజేత దీపను అభినందిస్తున్న ఎస్పీ జగదీశ్‌

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి యోగా విభాగంలో కాంస్య పతకం సాధించిన జిల్లా మహిళా కానిస్టేబులను జి.దీపను ఎస్పీ జగదీశ్‌ బుధవారం తన ఛాంబర్‌లో అభినందించారు. ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రం భిలాయి పట్టణం అగ్రసేన్‌ భవన్‌లో సెప్టెంబరు 23 నుంచి 27 వరకు ఆల్‌ ఇండియా పోలీస్‌ వెయిట్‌ లిఫ్టింగ్‌ క్లస్టర్‌లో 'యోగా' విభాగంలో పోటీలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్‌ పోలీసుశాఖకు మొత్తం 19 పతకాలు వచ్చాయి. అందులో 'ఆర్టిస్టిక్‌ యోగా' మహిళల విభాగంలో అనంతపురం మహిళా పోలీస్‌స్టేషన్‌కు చెందిన దీప మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు. పతకాన్ని ధరింపజేసి ఎస్పీ సత్కరించారు. గుంతకల్లు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఎస్‌.పులిశాబు ఆర్టిస్టిక్‌ గ్రూపు పురుషుల విభాగంలో ఐదో స్థానంలో నిలిచారు. సంప్రదాయ యోగాసన పురుషుల విభాగంలో అనంతపురం డీటీసీకి చెందిన ఎం.చలపతి 15 స్థానంలో నిలిచారు. వీరిని ఎస్పీ అభినందించారు.

ఆర్డీటీ గ్రామీణ బాలికల అథ్లెటిక్స్‌ పోటీలు ప్రారంభం

అనంతపురం క్రీడలు: ఆర్డీటీ ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర స్థాయి బాలికల అథ్లెటిక్స్‌ పోటీలు ప్రారంభమయ్యాయి. ఆర్డీటీ పనిచేస్తున్న 38 ప్రాంతాల నుంచి 400 మంది బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఆర్డీటీ డైరెక్టర్లు లైలా జులేఖా, మహమ్మద్‌ రఫీలు ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. తొలుత బాలికలు చేసిన టార్చ్‌రన్‌, మార్చ్‌ఫాస్ట్‌లు ఆకట్టుకున్నాయి. బాలురతో సమానంగా బాలికలను కూడా ఆటల్లో ప్రోత్సహించడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐదురోజులు ఈ పోటీలు 12 పర్యాయాలు నిర్వహించి ప్రతిభావంతులను వెలుగులోకి తెస్తామని వివరించారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ పోటీల్లో పరుగు, లాంగ్‌జంప్‌, షాట్‌పుట్‌ అంశాలు ఉంటాయని వివరించారు.



మార్చ్‌ఫాస్ట్‌ చేస్తున్న బాలికలు

కాస్త ఓపిక పట్టు.. నీ గుట్టు విప్పుతా: మంత్రి

ధర్మవరం, న్యూస్‌టుడే:: ఎమ్మెల్యే కేతిరెడ్డి ఎక్స్‌ వేదికగా చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ యాదవ్‌ దీటుగా స్పందించారు. ఎక్స్‌ వేదికగానే సమాధానం ఇస్తూ.. 'పచ్చకామెర్లు ఉన్నవారికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది అనే సామెత నీకు సరిగ్గా వర్తిస్తుంది కేతురెడ్డి. కబ్జా, కమీషన్‌, కలెక్షన్‌, కరప్షన్‌కు కేరాఫ్‌ అడ్రస్‌ నువ్వు. కమీషన్ల కక్కుర్తిలో బ్లాక్‌ మైండ్‌ ఆయిపోయింది. కాస్త ఓపిక పట్టు. నువ్వు, నీ రౌడీమూకలు చేసిన దారుణాలు, దౌర్జన్యాలు, నేరాలు, ఘోరాల గుట్టు విప్పుతా. తబ్‌ తక్‌ నీ నాయకుడి లాగా నువ్వు నీ బెంగళూరు ఫాంహౌస్‌మే విశ్రాంత్‌ కరో' అంటూ మంత్రి ఎక్స్‌లో మండిపడ్డారు.

సత్య.. నీ వాటాలు అందాయా? కేతిరెడ్డి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌పై వైకాపా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఎక్స్‌ వేదికగా విమర్శలు గుప్పించారు. బుధవారం ఎక్స్‌ వేదికగా.. 'సత్య ధర్మవరం నియోజకవర్గ ప్రజలు నిన్ను నమ్మి ఓటు వేసి గెలిపించిన పాపానికి నువ్వు, నీ కూటమి పార్టీ నేతలైన జనసేన, తెదేపా నాయకులు దౌర్జన్యాలకు దిగుతున్నారు' అని పోస్టు చేశారు. వాటాలు వేసుకుంటూ నియోజకవర్గ ప్రజల్ని భయపెట్టి ఇప్పటికే ఎంతో మంది దగ్గర వసూళ్లు చేశారు. సత్య నీ వాటాలు నీకు అందాయి కదా? అని ప్రశ్నించారు.

సెపక్‌తక్రా పోటీల్లో బాలికల జట్టు జయకేతనం


అనంతపురం బాలికల జట్టుకు కప్‌ అందిస్తున్న డీవీఈవో పద్మ

సత్తెనపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: సత్తెనపల్లి మండలం పెదమక్కెనలో రెండ్రోజులపాటు జరిగిన స్కూల్‌గేమ్స్‌ ఫెడరేషన్‌ రాష్ట్రస్థాయి అండర్‌-19 బాలబాలికల సెపక్‌తక్రా ఆటల పోటీలు బుధవారం ముగిశాయి. బాలుర విభాగంలో నువ్వానేనా అన్నట్లు పోటీ సాగింది. తుది పోరులో ప్రకాశం జిల్లా జట్టుపై కర్నూలు జిల్లా జట్టు గెలిచి విజేతగా నిలిచింది. ప్రకాశం జట్టు రెండు, పశ్చిమ గోదావరి జట్టు మూడో స్థానాన్ని దక్కించుకున్నాయి. బాలికల విభాగంలో తుది పోటీలో కృష్ణా జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు గెలిచింది. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు తెదేపా నాయకులు, అధికారులు కప్పులు, జ్ఞాపికలు అందించారు. మాజీ మున్సిపల్‌ ఛైర్మన్‌ యెలినేడి రామస్వామి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త వెంకటఅప్పారావు, సర్పంచి అన్నపూర్ణమ్మ, తెలుగురైతు నాయకులు శ్రీనివాసరావు, సాంబయ్య, ప్రాంతీయ ఇంటర్మీడియట్‌ అధికారి జి.కె.జుబేర్‌, డీవీఈవో జె.పద్మ తదితరులు పాల్గొన్నారు.

భీమవరం బుల్లెమ్మ పెళ్లి పేరిట మోసం

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం గ్రామీణ మండలానికి చెందిన ఓ యువకుడికి దాదాపు 40 ఏళ్లు వచ్చినా వివాహం కాలేదు. ఇంట్లో తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులు చూసిన అతడు వారిని సంతోష పెట్టాలని ఇక్కడి బ్రోకర్‌ను తీసుకొని భీమవరం ప్రాంతానికి వెళ్లి అక్కడున్న బ్రోకర్లను ఆశ్రయించాడు. వారు రూ.4 లక్షలు దండుకొని నీలపు బాల అనే మహిళతో వివాహం జరిపించారు. ఆమెను హిందూపురం తీసుకొచ్చినా అతడితో కాపురం చేయకుండా వాయిదా వేస్తూ వచ్చింది. వారం రోజుల తర్వాత తన తల్లిదండ్రులకు ఆరోగ్యం బాగోలేదని వెంటనే వెళ్లాలని చెప్పింది. దీనికి అతను నిరాకరించడంతో ఆత్మహత్య చేసుకొంటానని బెదిరించింది. చేసేదిలేక ఆమెను తీసుకొని భీమవరానికి రైలులో వెళ్లాడు. రైల్వేస్టేషన్‌లో దిగిన వెంటనే ఆమె మన వివాహం మా తల్లిదండ్రులకు తెలియదని, వారికి తెలిస్తే చాలా ఇబ్బందని, ఇక్కడే ఉండు వస్తానని చెప్పి వెళ్లింది. అంతే ఫోన్‌ స్విచ్‌ ఆఫ్‌ చేసి మూడు, నాలుగు రోజులు గడిచినా రాకపోవటంతో వెనుదిరిగిన అతను చేసేదిలేక బుధవారం బ్రోకర్లు, నీలపు బాలపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

6 నుంచి ఏపీటీఎఫ్‌ రాష్ట్ర మహాసభలు


గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్‌ నాయకులు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఏపీటీఎఫ్‌- 1938 సంఘం రాష్ట్ర మహాసభలు ఈ నెల 6, 7, 8 తేదీల్లో జరుగుతాయని ఆ సంఘం నేత కులశేఖర్‌రెడ్డి తెలిపారు. మహాసభలకు సంబంధించిన గోడపత్రాలు బుధవారం విడుదల చేశారు. విజయనగరంలో ఈ మహాసభలు జరుగుతాయన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసనాయక్‌, వెంకటసుబ్బయ్య, మహమ్మద్‌ రఫీక్‌ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి



మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్‌ నాయకులు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్‌ నాయకులు మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. యూటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ.. పురపాలక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పీఎఫ్‌ సదుపాయం కల్పించాలన్నారు. భాషాపండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు ఉన్నతీకరించి పదోన్నతులు కల్పించాలన్నారు. అర్బన్‌ ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటులో జరిగిన అసంబద్ధ విధానాలు ఉన్నాయన్నారు. జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, నాగేంద్ర, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, శివశంకర్‌ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో సచివాలయ ఉద్యోగి?

విడపనకల్లు(ఉరవకొండ): పింఛన్‌ సొమ్మును లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా విడపనకల్లు గ్రామ సచివాలయ ఉద్యోగి ఇనాయతుల్లా అదృశ్యమైన విషయం తెలిసిందే. ఆ ఉద్యోగిని బుధవారం విడపనకల్లు పోలీసులు అనంతపురంలో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అతణ్ని ఉరవకొండకు తీసుకువచ్చి విచారించగా, లబ్ధిదారులకు పింఛన్‌ నగదు పంపిణీ చేయడానికి వెళ్తుండగా రూ.2.52 లక్షలు ఎక్కడో పడిపోయాయని చెప్పినట్లు సమాచారం. రెండు రోజులు సమయం ఇస్తే, నగదును చెల్లిస్తానని ఒప్పుకొన్నట్లు తెలిసింది. దీనిపై పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

యువకుడి అనుమానాస్పద మృతి

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మండల పరిధిలోని తప్పెటవారిపల్లి గ్రామంలో సత్యనారాయణ (21) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. సత్యనారాయణ కొన్నేళ్లుగా కియా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్నప్పుడే తండ్రి చిన్న నారాయణ చనిపోయారు. అనంతపురంలో అద్దెగదిలో ఉంటూ అక్కడి నుంచి కియా కంపెనీకి వెళ్లి వచ్చేవాడు. ఇటీవల తల్లి సరోజమ్మ అనారోగ్యానికి గురికావడంతో చూసేందుకు ఆదివారం ఇంటికొచ్చాడు. సోమవారం తిరిగి విధులకు వెళ్తున్నానని చెప్పినా మంగళవారం గ్రామంలో కనిపించినట్లు స్థానికులు తెలిపారు. బుధవారం సత్యనారాయణ తోటలో మృతిచెంది కనిపించడంతో స్థానికులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. మృతికి కారణాలు తెలియరాలేదు. ముదిగుబ్బ గ్రామీణ సీఐ శ్యామరావు, పట్నం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం నల్లగా మారడంతో విద్యుదాఘాతంతో చనిపోయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వసతి గృహాల తనిఖీ


విద్యార్థుల హాజరు పరిశీలిస్తున్న న్యాయమూర్తి జయలక్ష్మి

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: మండల న్యాయ సేవ సాధికార సంస్థ ఛైర్మన్‌, కదిరి సీనియర్‌ సివిల్‌జడ్జి జయలక్ష్మి బుధవారం కదిరిలో ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల వసతి గృహాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, భోజనశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టిక, ఆహార పదార్థాల నాణ్యతపైనా ఆరాతీశారు. గురుకుల పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్నిసదుపాయాల అందేలా చూడాలని ప్రిన్సిపల్‌, వార్డెన్లకు సూచించారు. అప్రమత్తంగా ఉంటూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వార్డెన్లు దుర్గాప్రసాద్‌, సాంబశివుడు పాల్గొన్నారు.

టమాటా కిలో రూ.74

అనంతపురం (వ్యవసాయం): కక్కలపల్లి మార్కెట్‌లో టమాటా ధరలు భారీగా పెరిగాయి. బుధవారం మార్కెట్‌కు 675 టన్నులు టమాటా వచ్చింది. ధరలు పరిశీలిస్తే గరిష్ఠంగా మొదటి రకం కిలో రూ.74, రెండో రకం రూ.65, మూడో రకం రూ.50 చొప్పున ధరలు పలికాయి. 15 కిలోల బుట్ట ధర మొదటి రకం రూ.1,110, రెండో రకం రూ.975, మూడో రకం రూ.750 చొప్పున ధరలు పలికాయని మార్కెట్‌ ఇన్‌ఛార్జి రాంప్రసాద్‌రావు తెలిపారు.


విశాఖ ఉక్కుపై కూటమి వైఖరి తెలపాలి

కార్మిక సంఘాల డిమాండ్‌


మాట్లాడుతున్న సమన్వయ కమిటీ కన్వీనర్‌ రాజారెడ్డి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ అంశంపై ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని కార్మిక సంఘాలు డిమాండు చేశాయి. ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాల అధ్వర్యంలో బుధవారం కలెక్టర్‌ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. విశాఖ ఉక్కు పోరాట సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్‌ రాజారెడ్డి మాట్లాడుతూ.. ఆనాడు 32 మంది ప్రాణత్యాగంతో సాధించుకున్న ఉక్కు పరిశ్రమను భాజపా ప్రభుత్వం అడ్డదారిలో ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. భాజపా దేశంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసే పక్రియను వేగవంతం చేసిందన్నారు. ఉత్పత్తి స్థామర్థ్యాన్ని తగ్గించి ఉక్కు పరిశ్రమను నష్టాల్లోకి నెట్టిందన్నారు. కార్పొరేట్‌ కంపెనీలకు ఉక్కు పరిశ్రమను దారాదత్తం చేస్తూ వేలాది మంది కార్మికుల పొట్టను కొడుతుందన్నారు. ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించి, పరిశ్రమను కాపాడాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను 'స్టీల్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా లిమిటెడ్‌'లో విలీనం చేయడానికి ప్రభుత్వం ఆలోచిస్తుందని చెబుతూ, మరోవైపు 4,290 మంది కార్మికులను తొలగించడానికి ప్రయత్నం చేయడం దారుణమన్నారు. మరోవైపు 2,500 కార్మికులను వీఆర్‌ఎస్‌ ఇస్తామంటూ ప్రచారం జరుగుతుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విశాఖ ఉక్కును కాపాడుకుంటామని చెప్పిన తెదేపా, జనసేనలు ప్రైవేటీకరణ కాకుండా చూడాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌, ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్‌బాబు, బీసీ విద్యార్థి, యువజన సంఘాల అధ్యక్షులు కేశవ్‌, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్‌, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రామాంజి పాల్గొన్నారు.

గొర్రెల కాపరి మృతి


రామాంజనేయులు

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : వెంకటాంపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు (51) అనే గొర్రెల కాపరి ప్రమాదవశాత్తు కింద పడటంతో తలకు బలమైన గాయమై మృతి చెందారు. ఈఘటన బుధవారం రాత్రి జరిగింది. రామాంజనేయులు గ్రామ సమీపంలో గొర్రెల మంద వద్దకు రాత్రి నిద్రించడానికి వెళ్లాడు. రాత్రి వేళ నిద్రలో లేచి నీరు తాగడానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తలకు వెనుక భాగంలో రాయి తగలడంతో అక్కడే ఉన్న తోటి కాపరులు గుర్తించి చికిత్స నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య భూలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

హెచ్చెల్సీలో గుర్తు తెలియని మృతదేహం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం మేజర్‌ పంచాయతీ పరిధిలోని హెచ్చెల్సీ కాలవలో బుధవారం గుర్తుతెలియని పురుషుడి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుమారు 40 ఏళ్లు ఉన్న వ్యక్తి మృతదేహం అనంతపురం వైపు నుంచి మండల పరిధిలోని శర్మ కాలనీకి కొట్టుకువచ్చిందన్నారు. మృతదేహంపై నలుపు, తెలుపు రంగు అంగీ, నీలం రంగు జీన్స్‌ ప్యాంటు ఉందన్నారు. జేబులో రెండు చరవాణులు లభించాయన్నారు. ఇతని సమాచారం తెలిసినవాళ్లు బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

అప్పుల బాధతో కూలీ ఆత్మహత్య

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని రెడ్డిపల్లి అంబేడ్కర్‌ కాలనీలో నివాసం ఉంటున్న రాముడు(50) బుధవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన రాముడుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గ్రామంలోనే కూలీ పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. కుటుంబ పోషణకు గ్రామంలో వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు తీసుకున్నాడు. అధిక వడ్డీల కారణంగా ఇచ్చిన డబ్బులు చెల్లించలేక పోయారు. వ్యాపారులు రాముడు ఇంటిని కూడా అప్పులకు జమ చేసుకున్నట్లు తెలిసింది. అయినా వ్యాపారులు డబ్బులివ్వాలని ఒత్తిడి చేస్తుండటంతో ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ ఐకాసా అధ్యక్షుడు సాకే హరి మాట్లాడుతూ రాముడు కుటుంబాన్ని వేధించిన వడ్డీ వ్యాపారులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. రాముడి ఇంటిని ఆ కుటుంబానికి చెందేలా అధికారులు నిర్ణయం తీసుకోవాలన్నారు.

పుట్టెడు శోకం.. బతుకు భారం

- మంచానికే పరిమితమైన భర్త
- ముగ్గురు ఆడపిల్లలను పోషించలేక సతమతం

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: చిన్న కుటుంబం. సాఫీగా సాగిపోతున్న జీవితం. అనుకోని రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని కష్టాల్లోకి నెట్టింది. ఇంటి పెద్దను మంచానికే పరిమితం చేసింది. ఒక్కసారిగా ఆనందాలు దూరమయ్యాయి. తండ్రి నిస్సహాయ స్థితిలో పడి ఉండటాన్ని చూస్తూ పసి మనస్సులు తల్లడిల్లిపోతున్నాయి. ముగ్గురు ఆడ పిల్లలను పోషించలేక ఆ తల్లి గుండె శోకంతో బరువెక్కింది. రోజులు గడిచే కొద్దీ పూట గడవటం భారమైంది. కష్టకాలంలో ఆపన్న హస్తం అందించాలని ఆ చేతులు అర్థిస్తున్నాయి. కళ్యాణదుర్గం పట్టణంలోని రామస్వామి కాలనీలో నివాసం ఉంటున్న శ్రీనివాసులు, విశాలమ్మకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె చైత్రసాయి ఏడో తరగతి, రెండో కుమార్తె ఘణశ్రీ ఐదో తరగతి, భవ్యశ్రీ మూడో తరగతి చదువుతున్నారు. శ్రీనివాసులు ట్రాక్టర్‌ డ్రైవర్‌గా పని చేసేవారు. రూ.15లక్షలు అప్పు చేసి ఇల్లు కట్టుకున్నారు. ఉన్నంతలో భార్య, పిల్లలను పోషించుకునేవారు. గతేడాది నవంబర్‌ 14న గుండ్లపల్లి నుంచి ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఎదురుగా మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని తలకు గాయమైంది. వైద్యులు పరీక్షించి మెదడులో రక్తం గడ్డ కట్టిందని చెప్పారు. శస్త్రచికిత్స చేశారు. ఆ తర్వాత అనంతపురం, బెంగళూరులోని ఆసుపత్రుల్లో వైద్యం అందించారు. అయినా నయం కాలేదు. వైద్యం కోసం విశాలమ్మ రూ.15లక్షల వరకు అప్పు చేశారు. అప్పులిచ్చిన వారు తిరిగి కట్టాలని ఒత్తిడి తెస్తున్నారు. ఎటువంటి ఆసరా లేదు. భర్తకు పాలు తీసుకురావడానికి కూడా డబ్బులు లేవని కంటతడి పెట్టారు పిల్లల చదువులు, భవిష్యత్తును తలచుకొని రోధిస్తున్నారు. వీరి దీనగాథను చూసి చలించిన బ్యాంకు ఉద్యోగి లోకేశ్‌, అధ్యాపకుడు బాపూజీ, ఎంఈవో శ్రీధర్‌, ఉపాధ్యాయులు అశోక్‌, మంజునాథ్‌ తదితరులు రూ.8వేల విలువైన సరకులు, రూ.12వేల నగదు అందజేశారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఆపన్న హస్తం అందించి ఆదుకోవాలని విశాలమ్మ వేడుకొంటున్నారు.


కుమార్తెలతో విశాలమ్మ


నిస్సహాయ స్థితిలో శ్రీనివాసులు

రాయదుర్గం
•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

చెత్త సంపద తయారీ కేంద్రం ప్రారంభం


ప్రారంభోత్సవంలో ఈవోఆర్డీ దాస్, తెదేపా నాయకులు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని కొలగానహళ్లి గ్రామంలో బుధవారం గాంధీ జయంతి సందర్భంగా చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని ఈవోఆర్డీ దాస్, తెదేపా నాయకుడు ప్రభాకర్‌నాయుడు, సర్పంచి శ్రుతి ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంపద కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివన్న, తెదేపా నాయకులు రమేశ్, నాగరాజు, అనంతరాజు తదితరులు పాల్గొన్నారు.

'వంక నీటిని మళ్లించండి'

వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరు మండలంలోని ఎన్ఎన్‌పీ తండాకు వెళ్లే దారిలో ప్రవహిస్తున్న వంక నీటిని మళ్లించి, రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని తెదేపా మండల కన్వీనర్ నూతేటి వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ మండల ఇంజినీర్ మణిభూషణ్‌ను కోరారు. బుధవారం ఆయన స్థానిక తెదేపా నాయకులు, అధికారులతో కలిసి వంకను పరిశీలించారు. హంద్రీనీవా నీరు వంకల ద్వారా రామగిరి చెరువుకు చేరుతాయని, ఈ క్రమంలో తండాకు వెళ్లే దారిలో ప్రవహిస్తుండటంతో పాచి పట్టి ప్రమాదకరంగా మారిందని తెలిపారు. ఇక్కడ ద్విచక్ర వాహనదారులు, పాదచారులు కిందపడి గాయాల పాలవుతున్నారని చెప్పారు. ప్రవాహ ఉద్ధృతి తగ్గగానే కల్వర్టు నిర్మిస్తామని ఇంజినీర్ హామీ ఇచ్చారు. తెదేపా నాయకులు నాగేంద్ర, సుదాకర్, ఎర్రిస్వామి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయిచందు తదితరులు పాల్గొన్నారు.

మద్యాన్ని నియంత్రించాలని వినతి

కళ్యాణదుర్గం గ్రామీణం: రాష్ట్రంలో మద్యాన్ని నియంత్రించాలని, మహాత్ముని కలలు నిజం చేయాలని కోరుతూ ఐద్వా, డివిజన్ కార్యదర్శి లత అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో మహాత్ముని విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి పాతక్క, సంఘం నాయకురాళ్లు లక్ష్మీ, తులసి, పద్మ, భారతి పాల్గొన్నారు.

బొమ్మనహాళ్‌లో మోస్తరు వర్షం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని కొలగానహళ్లి, లింగదహాళ్, కృష్ణాపురం, మైలాపురం, ఎల్‌బీనగర్ తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షం గంట పాటు కురిసింది. దాంతో గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షం వల్ల వరి పంటకు మేలు అని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

ఉరవకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్‌లో ఉచిత యోగా శిక్షణ పొందుతున్న భరణి అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ఆ సంస్థ సమన్వయకర్త వెంకట బుధవారం తెలిపారు. భరణి ఉరవకొండ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈనెల 5 నుంచి 7 వరకు కర్నూలులో జరగనున్న పోటీల్లో పాల్గొననుంది. విద్యార్థిని ప్రయాణానికి, దుస్తులకు విశ్రాంత ఎంపీడీవో గణేశ్‌బాబు రూ.2వేలు ఆర్థిక సాయం అందించి, అభినందించారు.

కొల్లారి మృతికి కారకులను అరెస్టు చేయాలి

రాయదుర్గం, న్యూస్‌టుడే: మున్సిపల్ కార్మికుడు కొల్లారిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారని, కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేయాలని మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు రాము, తెదేపా నాయకుడు ఆనంద్, కార్మికులు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు విజ్ఞప్తి చేశారు. కొల్లారి ఆత్మ శాంతించాలని ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ వలి, కౌన్సిలర్లు, అధికారులు, కార్మికులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. రాయదుర్గం పోలీసుస్టేషనులో డీఎస్పీ పి.రవిబాబు విలేకరులతో మాట్లాడారు. కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి నిందితులను పట్టుకుంటామన్నారు.

శవ పరీక్ష విషయంలో గొడవ

రాయదుర్గం: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో కొల్లారి శవపరీక్ష విషయంలో బుధవారం ఇద్దరు వైద్యుల మధ్య గొడవ జరిగింది. దాంతో గంటన్నరకుపైగా ఆలస్యం అయ్యింది. అనుమానాస్పద మృతి కేసు విషయంలో ఎక్కువ మంది వైద్యులతో పోస్టుమార్టం చేయాలని, అవసరమైతే అనంతపురం ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేయాలంటూ వైద్యుడు అనంత రామకృష్ణ సూచించినట్లు తెలిసింది. ఈ విషయంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవీలత, వైద్యుడు అనంత రామకృష్ణ మధ్య గొడవ జరిగింది. చివరకు ఆమె మరొక వైద్యురాలి సాయంతో శవ పరీక్ష చేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వజ్రకరూరు, న్యూస్‌టుడే: ఉరవకొండ పట్టణానికి చెందిన సంజప్ప(48) పని మీద గత నెల 26న ద్విచక్రవాహనంపై గుంతకల్లు వెళ్తుండగా కుక్క అడ్డొచ్చింది. దాన్ని తప్పించబోయి చెట్టును ఢీకొన్నాడు. కుటుంబసభ్యులు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య పుష్పవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రమేశ్ తెలిపారు.

పనుల గుర్తింపుతో ఉపాధి

కణేకల్లు, న్యూస్‌టుడే: పనుల గుర్తింపుతో కూలీలకు ఉపాధి కల్పించి గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓఆర్డీ గూడెన్న, ఏపీఓ సుధాకర్ తెలిపారు. స్థానిక రాంనగర్ గ్రామ సచివాలయం-2లో సర్పంచి నిర్మల, ఎంపీపీ లీలావతి ఆధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధిహామీ పనుల గుర్తింపు గ్రామసభ నిర్వహించారు. ఏపీఓ సుధాకర్, ఈఓ ప్రసాద్, తెదేపా మండల కన్వీనర్ లాలెప్ప, నాయకులు ఆనందరాజు, చంద్రశేఖరగుప్తా, చాంద్, రమేశ్, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే సంత.. ఇంకెన్నాళ్లీ తంటా

ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలతో పాటు ఉరవకొండ మేజర్ పంచాయతీలో కూరగాయల మార్కెట్లు లేవు. వ్యాపారులు రోడ్ల పక్కన, ఎక్కడపడితే అక్కడ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దాంతో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. మరోవైపు దుమ్ము ధూళి పడి, కూరగాయల నాణ్యత కొరవడుతుంది. మున్సిపాలిటీలు, పంచాయతీకి ఆదాయం వస్తున్నా మార్కెట్ల ఏర్పాటులో ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇంకెన్నాళ్లు ఎదురు చూడాలోనని ప్రజలు, వ్యాపారులు పెదవి విరుస్తున్నారు.

ఒక్క అడుగు ముందుకు పడలేదు



ఉరవకొండ మేజర్ పంచాయతీలో రోడ్లపక్కనే కూరగాయలు విక్రయిస్తున్నారు. ఇక్కడ 40వేలకుపైగా జనాభా ఉంది. వారితో పాటు ఐదు మండలాల ప్రజలు ఇక్కడికి కూరగాయలు కొనేందుకు వస్తుంటారు. దినసరి మార్కెట్ ద్వారా పంచాయతీకి ఏటా రూ.12లక్షలకుపైగా ఆదాయం వస్తుంది. గడియార స్తంభం వద్ద వ్యాపారులు ఆకుకూరలు, కూరగాయలు అమ్మేవారు. ఇటీవల అధికారులు వారిని మరో చోటకు మార్చారు. గత వైకాపా ప్రభుత్వంలో మార్కెట్‌ను లత్తవరం రహదారిలోని పంచాయతీ స్థలంలో ఏర్పాటు చేయిస్తున్నట్లు హడావుడి చేశారు. ఒక్క అడుగు ముందుకు పడలేదు. దీనిపై పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ వివరణ కోరగా అందరికీ అనువైన ప్రదేశంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు చర్యలు చేపడతామని చెప్పారు.

కళ్యాణదుర్గంలో కిటకిట

కళ్యాణదుర్గం మార్కెట్ యార్డులో ప్రతి శుక్రవారం సంత నిర్వహించుకోవడానికి అవకాశం ఉంది. అంత దూరం ప్రజలు వచ్చి కూరగాయలు కొనుగోలు చేయలేరని బళ్లారి మిట్ట, దొడగట్ట రోడ్డులో రైతులు, వ్యాపారులు విక్రయాలు కొనసాగిస్తున్నారు. అర కిలోమీటరు మేర విస్తరిస్తున్నారు. ట్రాఫిక్ సమస్యతో అన్ని వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో టీ కూడలి వద్ద దిన మార్కెట్‌ను తరలించడంతో కూరగాయల విక్రయాలకు, వారపు సంతకు సరైన చోటు లేక అవస్థ పడుతున్నారు. సంత నిర్వహణకు స్థలం చూపాలని వ్యాపారులు, ప్రజలు అధికారులను కోరుతున్నారు.



ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

రాయదుర్గం పట్టణంలోని ఓబుళాచారిరోడ్డు, గాంధీ సర్కిల్ వద్ద రోడ్లపైనే వ్యాపారాలు చేస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం నెలకొంటుంది. వాహనం బ్రేకులు ఫెయిలైనా, డ్రైవర్లు ఆదమరచినా భారీ ప్రమాదం జరిగే అవకాశం ఉంది. మున్సిపల్ కాంప్లెక్స్‌ల వద్ద రిటైల్ వ్యాపారుల కోసం చిన్న గదులు ఏర్పాటు చేశారు. వాటిలో ఎవరూ వ్యాపారం చేయకపోవటంతో నిరుపయోగంగా మారాయి. వ్యాపారాలు బాగా జరగాలనే పోటీతో రోడ్డు పైకి వచ్చి అమ్ముతున్నారు. ఆంజనేయస్వామి విగ్రహం వద్ద వ్యాపారాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెదేపా నాయకులు సూచించారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డిని వివరణ కోరగా రాయదుర్గంలో రైతు బజారు లేదు. వివిధ గ్రామాల నుంచి వచ్చే రైతులకు త్వరలో స్థలాన్ని కేటాయిస్తామన్నారు.



మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: శెట్టూరులో ప్రధాన రోడ్డుకు ఒక వైపే కాలువ ఉంది. నీరు ఎక్కడికక్కడే ఆగుతుంది. కాలువ ఎత్తు పెంచి నీరు పోయేలా చూడాలి. **- అబ్దుల్‌రజాక్**
సమాధానం: ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే పనులు పూర్తి చేస్తాం. **- కుమార్, సర్పంచి**
సమస్య: శెట్టూరు సాయిబాబ గుడి మలుపు వద్ద వేగనిరోధకాలు వేయించాలి. **- బాషా, మెకానిక్**
సమాధానం: తగిన చర్యలు తీసుకుంటాం. **- రఘురామరావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో** - న్యూస్‌టుడే, శెట్టూరు

సమస్య: కణేకల్లులో అతావుల్లా కాన్వెంట్ సమీపంలో మురుగునీరు రోడ్డుపై నిల్వ చేరింది. శుభ్రం చేయించాలి. **- అతావుల్లా**
సమాధానం: శుభ్రం చేయిస్తాం. **- ఎంఎల్ఎన్ ప్రసాద్, ఈఓ** - న్యూస్‌టుడే, కణేకల్లు



సమస్య: విడపనకల్లు మండలం పాల్తూరులో పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు ఆనుకుని జీబీసీ నీరు ప్రవహిస్తున్నాయి. చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. **- తల్లిదండ్రులు**
సమాధానం: సమస్య పరిష్కారానికి చొరవ చూపుతాం. **- డాక్టర్ శ్రీదేవి, సీడీపీవో** - న్యూస్‌టుడే, ఉరవకొండ

ప్రజా సమస్యలు పరిష్కరిస్తేనే గుర్తింపు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిషత్తు కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఇటీవలే బదిలీ అయిన అధికారులను బుధవారం ఎంపీపీ మారుతమ్మ, జడ్పీటీసీ సభ్యులు బొమ్మన్న, నాగరాజు ఆధ్వర్యంలో సన్మానించారు. ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వహిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తే గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం డీఎల్‌డీవో శంకర్, ఎంపీడీవో సాలమన్, ఈవోఆర్డీ హరికృష్ణబాలాజీ, ఏవో శంకర్, సీనియర్ అసిస్టెంట్ ఏకాంబరీశ్వరయ్య, జూనియర్ అసిస్టెంట్ సరిత, పంచాయతీ కార్యదర్శులు నారాయణస్వామి, వీరకరియప్ప, షబానా, హరికృష్ణ, ఆఫీస్ సబార్డినేటర్ నిశాంత్‌ను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.


బదిలీ అయిన వారిని సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నేటి నుంచి నవరాత్రోత్సవాలు

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ మండలం పెన్నహోబిలంలోని ఉద్భవలక్ష్మి అమ్మవారి ఆలయం దసరా నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు అయ్యింది. తొమ్మిది రోజుల పాటు అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమివ్వనున్నారు. 3న ఆదిలక్ష్మి, 4న ధనలక్ష్మి, 5న ధాన్యలక్ష్మి, 6న సంతానలక్ష్మి, 7న మహాలక్ష్మి, 8న గజలక్ష్మి, 9న విద్యాలక్ష్మి, 10న ధైర్యలక్ష్మి, 11న వీరలక్ష్మి, 12న విజయలక్ష్మిగా అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి, దుర్గాభవాని, ఉరగాద్రి చౌడేశ్వరి, కన్యకా పరమేశ్వరి, ఈశ్వరమ్మ, జగదీశ్వరమ్మ ఆలయాలు నవరాత్రులకు ముస్తాబు అయ్యాయి. ఈ ఆలయాల్లోనూ అమ్మవార్లు రోజూ ఓ రూపంలో దర్శనం ఇవ్వనున్నారు.


కళ్యాణదుర్గం: నివాళి అర్పిస్తున్న తెదేపా నాయకులు


ఉరవకొండ లయన్స్ క్లబ్‌లో..


రాయదుర్గంలో..

మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దాం

మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దామని పలువురు పిలుపునిచ్చారు. బుధవారం గాంధీ జయంతి పురస్కరించుకుని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.
- న్యూస్‌టుడే బృందం


నివాళి అర్పిస్తున్న శిక్షణ కలెక్టర్ వినూత్న

గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని 74ఉడేగోళం, వడ్రవన్నూరు, వేపరాళ్ల, కెంచానపల్లి, డి.కొండాపురం, టి.వీరాపురం, నాగిరెడ్డిపల్లి, పల్లేపల్లి, మల్లాపురం తదితర గ్రామాల్లో మంగళవారం గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శుభ్రతా చర్యలు చేపట్టారు. అనంతరం గ్రామసభలు నిర్వహించి 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టే వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు.

డ్రైనేజీ గుంతలు పూడ్చరూ



కళ్యాణదుర్గం పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో డ్రైనేజీ గుంతలు ప్రమాదకరంగా మారాయి. బుధవారం ఓ కారు గుంతలో ఇరుక్కుపోయి సుమారు అరగంటకుపైగానే ట్రాఫిక్ స్తంభించింది. బస్సు ఎదురుగా రావడంతో కారు పక్కకు వెళ్లే సమయంలో డ్రైనేజీలో ఇరుక్కుపోయింది. దాంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. నిత్యం ఈ సమస్య ఎదురవుతుంది. సంబంధిత అధికారులు పరిశీలించి డ్రైనేజీ గుంతలను మూసివేయాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

వంతెనపై జాగ్రత్త

కణేకల్లు మండలంలోని గరుడచేడు-మీనహళ్లి గ్రామాల నడుమ కొనగి వంకపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. రంధ్రం పడి ప్రమాదకరంగా తయారైంది. వాహనాల రాకపోకల సమయంలో వంతెన కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. కనీసం సూచిక బోర్డు ఏర్పాటు చేయలేదు. కణేకల్లు, సొల్లాపురం తదితర గ్రామాల నుంచి దర్గాహొన్నూరుకు నిత్యం వాహనాల రద్దీ ఉండే దారిలో వంతెనకు రంధ్రం పడటంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ర.భ అధికారులు రంధ్రం పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కణేకల్లు



మురుగు దారిలో నరక ప్రయాణం



ఉరవకొండ మండలం నింబగల్లు గ్రామంలో ప్రధాన రహదారిపై మురుగు నిల్వ చేరి తీవ్ర అపరిశుభ్రత నెలకొంది. దారి పొడవునా గుంతల్లో మురుగునీరు నిల్వ ఉంది. భరించలేని దుర్వాసన వస్తుంది. అందులో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. చాలా కాలంగా ఈ పరిస్థితి ఉంది. అధికారులు తగిన చర్యలు చేపట్టడం లేదు. పంచాయతీ అధికారులు చొరవ చూపి పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి నాగరాజు దృష్టికి తీసుకుపోగా, మురుగు నిల్వ లేకుండ శుభ్రత చర్యలు చేపడుతామన్నారు. - న్యూస్‌టుడే, ఉరవకొండ

యంత్రాలకు తుప్పు

ఉరవకొండలోని సంపద సృష్టి కేంద్రంలో చెత్తను శుద్ధి చేయడానికి గతంలో యంత్రాలు మంజూరు అయ్యాయి. వాటిని వినియోగంలోకి తీసుకురాలేదు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉంచారు. రూ.లక్షలు విలువ చేసే యంత్రాలు ఎండకు ఎండి, వానకు తడుస్తూ తుప్పు పడుతున్నాయి. కనీసం భద్రపరిచే దిశగా చర్యలు చేపట్టలేదు. అలాగే వదిలేస్తే పనికి రాకుండా పోయే అవకాశం ఉంది. విషయాన్ని పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ దృష్టికి తీసుకెళ్లగా విద్యుత్తు సరఫరా కోసం దరఖాస్తు చేశాం. మంజూరు కాగానే వినియోగంలోకి తెస్తామన్నారు.
- న్యూస్‌టుడే, ఉరవకొండ



మర్రిమాకులపల్లిలో తీవ్ర తాగునీటి ఎద్దడి

కంబదూరు, న్యూస్‌టుడే: మండలంలోని మర్రిమాకులపల్లి గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. ఆరు నెలలుగా కష్టాలు తప్పడం లేదని గ్రామస్థులు వాపోయారు. ఇక్కడ సుమారు 650 పైకిపైగా గృహాలు ఉన్నాయి. అడపాదడపా కుళాయిలకు వచ్చిన నీటిని జనం పట్టుకుంటున్నారు. అయితే దిగువనున్న 300 గృహాలకు అవి సరిపోవడం లేదు. పైభాగన ఉన్న యాదవ కాలనీకి పూర్తిగా అందడం లేదు. గత్యంతరం లేక ప్రజలు ఎద్దుల బండ్లు, ద్విచక్ర వాహనాల్లో వ్యవసాయ పొలాలకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. స్థానిక సర్పంచి కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు సమస్యను విన్నవించినా పరిష్కారం కాలేదని గ్రామస్థులు ఈరన్న, మల్లికార్జున, చోళమ్మ, నాగమ్మ, అక్కమ్మతో పాటు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మోటార్లు మరమ్మతులకు గురయ్యాయని, దాంతో తాగునీటి కొరత తీవ్రంగా ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య తీర్చాలని వారు కోరుతున్నారు.


ఎడ్ల బండి, బైక్‌పై నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్థులు

ప్రతి ఇంటా స్వచ్ఛత.. ఆరోగ్యానికి రక్ష

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: ప్రతి ఇంటా స్వచ్ఛత చేపడితే ఆరోగ్యంతో పాటు పట్టణం పరిశుభ్రంగా ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ తెలిపారు. బుధవారం స్వచ్ఛత హీ సేవా ముగింపు కార్యక్రమం జరిగింది. తెదేపా నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది గాంధీ సర్కిల్ నుంచి టీ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఇళ్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. తెదేపా నాయకులు, మున్సిపల్ అధికారులు చీపుర్లు పట్టుకుని రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మల్లికార్జున, ఎమ్మెల్యే మేనల్లుడు ధర్మతేజ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ వై.పి.రమేష్, పట్టణ కన్వీనర్ శర్మాస్, మురళి, శ్రీనివాసరెడ్డి, తిప్పేస్వామి, మండల కన్వీనర్లు శ్రీరాములు, ధనుంజయ, శివన్న, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ అధికారులు, తెదేపా నాయకులు

ఆదాయ ధ్రువపత్రాలు అందక అవస్థ

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదాయ ధ్రువపత్రాలు సకాలంలో అందక పలువురు లబ్ధిదారులు అవస్థ పడుతున్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు, పింఛన్‌దారులు, అంగన్‌వాడీ పోస్టుల దరఖాస్తులకు ఆదాయ ధ్రువపత్రాలు తప్పనిసరి. దరఖాస్తులు అందించి పది రోజులవుతున్నా మంజూరు చేయలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణదుర్గం తహసీల్దారు కార్యాలయంలో గతంలో పని చేసిన ఉప తహసీల్దారు బదిలీ కావడం, ఆయన 'డిజిటల్ కీ' వెంట తీసుకెళ్లడంతోనే సమస్య నెలకొందని కార్యాలయ అధికారులు చెబుతున్నారు. సుమారు 300కుపైగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తుదారులు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి త్వరగా మంజూరు చేయాలని కోరుతున్నారు. దీనిపై తహసీల్దారు భాస్కర్‌ను వివరణ కోరగా ఆదాయ ధ్రువపత్రాలు ఆగిన విషయం కళ్యాణదుర్గం శిక్షణ కలెక్టర్, ఇన్‌ఛార్జి ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లాం. ఉప తహసీల్దారు బాధ్యతలు చేపట్టిన వెంటనే మంజూరుకు చర్యలు చేపడతాం.

రోజూ ప్రదక్షణలు చేస్తున్నా..



అంగన్‌వాడీ సహాయ పోస్టుకు దరఖాస్తు చేయాలనుకున్నా. ఆదాయ ధ్రువపత్రం తప్పనిసరి. దరఖాస్తు చేసి ఐదారు రోజులవుతోంది. ప్రస్తుతం గర్భంతో ఉన్నా. కార్యాలయానికి రోజూ తిరుగుతున్నా ఫలితం లేదు. పోస్టుకు దరఖాస్తు చేసేందుకు సమయం లేదు. సమస్యను ఎవరితో చెప్పుకోవాలో తెలియడం లేదు. **- పావని, పార్వతీనగర్, కళ్యాణదుర్గం**

చెత్తశుద్ధికి శ్రీకారం

లక్ష్యం: 5 నెలల్లో 85వేల టన్నులు

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం మున్సిపాలిటీలో దశాబ్ద కాలంగా పేరుకుపోయిన చెత్తను శుద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా పవర్ వారియర్ 1200 సెగ్రిగేషన్ యంత్రాన్ని బుధవారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రారంభించారు. స్థానిక బళ్లారి రోడ్డులోని కంపోస్ట్ యార్డులో ఈ కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప, కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు, తెదేపా నాయకులు, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

రూ.4 కోట్లు మంజూరు: కంపోస్ట్ యార్డులో 85 వేల టన్నుల చెత్త పేరుకుపోయింది. దీన్ని శుభ్రం చేసేందుకు స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ రూ.4కోట్లు కేటాయించింది. ఈ పనిని జ్ఞానేశ్వర్ ఇంజినీరింగ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి అప్పగించింది. కంపోస్ట్‌యార్డులో చెత్త వేసేందుకు స్థలం లేదు. దాంతో నిప్పు పెట్టేవారు. లేదంటే రోడ్లు, చెరువులు, ఇతర ఖాళీ స్థలాల్లో వేసేవారు. పట్టణ సమీపంలో విలువైన స్థలాలు ఉండటంతో కంపోస్ట్ యార్డుకు స్థలం దొరకటం గగనమైంది. యార్డులోని చెత్తకు నిప్పు పెట్టినప్పుడల్లా పొగ పట్టణమంతా వ్యాపించి ప్రజలు శ్వాసకోశ, చర్మ వ్యాధులకు గురయ్యేవారు. ఇకపై ఆ సమస్య ఉండదు.

ఎలా శుద్ధి చేస్తారంటే.. : చెత్తను యంత్రం ద్వారా పైకి, కిందకు వడబోస్తారు. బ్యాక్టీరియా నశింపజేసేందుకు రసాయనిక చర్య నిర్వహిస్తారు. ఆ తర్వాత ఎండబెడతారు. చెత్తలోని రాళ్లు, గాజు పెంకులు, ఇనుప ముక్కలు, మట్టి, ప్లాస్టిక్, పేపర్లను వేరు చేస్తారు. అందులో సారవంతమైన మట్టి వస్తే రసాయనాలతో శుద్ధి చేసి వ్యవసాయ పొలాలు లేదా అవసరాలకు సరఫరా చేస్తారు. రాళ్లు, ఇనుప ముక్కలను సిమెంట్ పరిశ్రమలకు తరలిస్తారు. ప్లాస్టిక్ వస్తువులు, సంచులు భూమిలో కలవకుండా రీయూజ్ చేసే సంస్థలకు పంపుతారు. ఈ విధానంతో వేల టన్నుల చెత్త శుభ్రమై ఖాళీ స్థలం ఏర్పడనుంది. మొత్తం 85 వేల టన్నుల చెత్తను ఐదు నెలల్లో శుద్ధి చేయనున్నారు.


చెత్తను శుభ్రం చేస్తున్న యంత్రం

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి


సత్యాగ్రహ దీక్షలో యూటీఎఫ్ నేతలు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ నేతలు బుధవారం గుంతకల్లు పట్టణంలో మహాత్మగాంధీ విగ్రహానికి వినతి అర్పించి సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి, జిల్లా కోశాధికారి రమేష్ గాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు.

వరద బాధితులకు రోటరీ క్లబ్ విరాళం

తాడిపత్రి, న్యూస్‌టుడే: ఇటీవల విజయవాడలో వరదలు రావడంతో అక్కడి ప్రజలు తీవ్ర కష్టాల్లో ఉన్నారని, వారిని ఆదుకునేందుకు తాడిపత్రి రోటరీక్లబ్ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. క్లబ్ సభ్యులు బుధవారం విజయవాడలోని మంత్రి నారాలోకేశ్‌కు రూ. 1,10,000 విలువ చేసే చెక్కును అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, సభ్యులు కిషోర్‌కుమార్, రవి, అబ్దుల్ రహీం, కుళ్లాయిస్వామి పాల్గొన్నారు.


మంత్రి నారాలోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

పెట్టుబడి సాయం అందించండి


శింగనమల, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు భాస్కర్, శ్రీనివాసులు, కొండారెడ్డి పాల్గొన్నారు.

మన చేతుల్లోనే పరిసరాల పరిశుభ్రత

తాడిపత్రి, న్యూస్‌టుడే: మన చుట్టూ ఉన్న పరిసరాలను మనమే శుభ్రం చేసుకుందామని తాడిపత్రి ఆర్టీసీ డిపో మేనేజర్ శంకర్ పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండులో గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆర్టీసీ సిబ్బంది, అధికారులు పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఆర్టీసీ ప్రాంగణంలో మొక్కలు నాటారు.

సాగునీరు.. వృథాతీరు

➤ చంద్రాయని కుంట జలాశయ షట్టర్‌కు లీకేజీ ➤ గగ్గోలు పెడుతున్న రైతులు


చంద్రాయని కుంట జలాశయం

గుత్తి, గుంతకల్లు, న్యూస్‌టుడే: హెచ్చెల్సీ అధికారుల నిర్లక్ష్యం వల్ల చెర్లోపల్లి వద్ద ఉన్న చంద్రాయని కుంట జలాశయంలోని నీరు వృథా అవుతోంది. షట్టర్ పూర్తిగా మూసుకోవడం లేదు. వంకర్లుగా ఉండటంతో జలాశయంలోని నీరు కాలువ గుండా వాగులపాలు అవుతోంది.

17,500 ఎకరాల ఆయకట్టు

గుంతకల్లు జీబీసీ కెనాల్ కింద, ఎడమ కాలువల కింద 17,500 ఎకరాల ఆయకట్టు ఉంది. 1976లో ప్రభుత్వం కాలువలను నిర్మించింది. హెచ్ఎల్సీ నీటి కేటాంపులు చేసిన ప్రభుత్వం జీబీసీకి హెచ్ఎల్సీ నీరు ఇవ్వలేకపోతోంది. వైటీ చెరువు, పాతకొత్తచెరువుల్లో నీటిని నింపి అక్కడి నుంచి కాలువలకు నీరు విడుదల చేసేవారు. ఈవిషయంలో హెచ్ఎల్సీ రైతులకు, చెరువు ఆయకట్టు రైతులకు నీటి విడుదల విషయంలో గొడవలు జరిగేవి. ఈక్రమంలోనే ప్రభుత్వం పాతకొత్తచెరువుతో సంబంధంలేకుండా కుడి కాలువ ఆయకట్టుకు నీరు అందించాలని బైపాస్ కాలువను పదేళ్ల కిందట నిర్మించింది. బైపాస్ కెనాల్ నుంచి చంద్రాయని కుంటకు నీరు ఇవ్వాల్సి ఉంది. హెచ్ఎల్సీ నీరు కాలువలకు సుమారు 20 ఏళ్ల నుంచి రావడం లేదు. ఆయకట్టును బీడుగా ఉంచుకోలేక రైతులు వర్షాధారం కింద పంటలను సాగు చేసుకుంటున్నారు. కుడి కాలువ ద్వారా నీటిని ఆయకట్టుకు నీరు అందించాలని చంద్రాయని కుంటలో జలాశయాన్ని నిర్మించారు. అందులో నీరు నిల్వ ఉంచి రైతులను సాగునీరు అందించి ఆదుకోవాలని రిజర్వాయర్‌కు హంద్రీనీవా నీరు విడుదల చేస్తున్నారు.


కాలువలో వృథాగా పోతున్న హంద్రీనీవా నీరు

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

హంద్రీనీవా నీటిని ప్రస్తుతం గుత్తిచెరువుకు విడుదల చేస్తున్నారు. చంద్రాయని కుంట జలాశయం షట్టర్ వంగిపోయింది. దీంతో నీరు వృథాగా వాగుల్లోకి వెళుతోంది. దీని కింద 7,500 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆయకట్టుకు నీరు రావడంలేదు. పూలకుంట, బ్రాహ్మణపల్లి, అనగానదొడ్డి, ఎర్రగుడి, ఈశ్వరపల్లి తదితర గ్రామాలలో బోరు బావుల్లో నీటి మట్టం పెరగాల్సి ఉంది. జలాశయంలోని వచ్చి చేరుతున్న నీరు వృథాగా పోతుండటంతో రైతులు, ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలాశయంలోని నీరు రెండేళ్ల నుంచి వృథాగా పోతోంది. అయినా హెచ్ఎల్సీ అధికారులు మేల్కోలేకపోతున్నారు. షట్టర్‌కు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు. ఈవిషయమై ఏఈఈ వాసుదేవ్ మాట్లాడుతూ షట్టర్ అడుగుభాగం సరిగా లేదని, వారంలోగా నీటి వృథాను అరికడతామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య: శింగనమల మండలం తరిమెల గ్రామ ప్రధాన వీధుల్లో, బస్టాండ్ వద్ద వీధి దీపం లేదు. **- రామచంద్ర, తరిమెల**
సమాధానం: వెంటనే వీధి దీపాలు వేయిస్తాం. **- నిర్మలకుమారి, ఎమ్పీడీవో**
సమస్య: నాయనవారిపల్లి గ్రామంలో పాఠశాలకు వెళ్లే దారిలో రోడ్డుపై మురుగు ప్రవహిస్తోంది. **- సురేష్, నాయనవారిపల్లి**
సమాధానం: సమస్యను పరిష్కరిస్తాం. **- నిర్మలకుమారి, ఎమ్పీడీవో**
– న్యూస్‌టుడే, శింగనమల

బదిలీ అధికారులకు సన్మానం


అధికారులకు సన్మానం చేస్తున్న కార్యదర్శులు, సర్పంచులు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: గార్లదిన్నె ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు అధికారులు బదిలీ కావడంతో బుధవారం వారిని ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో విజయభాస్కర్, ఈవోఆర్డీ వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు బదిలీ కావడంతో సన్మానించారు. ఈకార్యక్రమంలో అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా వాక్‌థాన్


వాక్‌థాన్‌లో పాల్గొన్న రైల్వే రక్షణదళం సిబ్బంది

గుంతకల్లు, న్యూస్‌టుడే: దేశం, ప్రజల శ్రేయోభివృద్ధికి గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రీలు ఏ సిద్ధాంతాలను పాటించారో వాటిని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుంతకల్లు రైల్వే డివిజన్ రైల్వే రక్షణదళం కమిషనర్ మురళీకృష్ణ అన్నారు. గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతులను పురస్కరించుకుని వారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి గుంతకల్లుకు చెందిన ఆర్పీఎఫ్‌లు బుధవారం రాత్రి 3 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు 21 కి.మీ.లు వాక్‌థాన్‌ను నిర్వహించారు. బంటనహాల్ గ్రామం నుంచి గుంతకల్లు రైల్వే జంక్షన్ వరకు నడక కొనసాగింది. సిబ్బందితో పాటు కమిషనర్ నడకలో పాల్గొన్నారు. జంక్షన్‌లో జరిగిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. సీఐలు వసంతరావ్, బెన్నయ, తదితరులు పాల్గొన్నారు.

‘నూతన మద్యం విధానాన్ని రద్దు చేయాలి’

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: నూతన మద్యం పాలసీ విధానం రద్దు చేయాలని ఐద్వా సంఘం, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ విద్యార్థి సంఘాలు బుధవారం గాంధీ విగ్రహానికి వినతి పత్రంను అందజేశారు. ఐద్వా మహిళా సంఘం అధ్యక్షురాలు జ్యోతి, కార్యదర్శి రంగమ్మ, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రమేష్, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్ర మాట్లాడారు. మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతూ పట్టణ నడిబొడ్డున ఉన్న గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఐద్వా నాయకురాలు రేణుక, నిర్మల, శ్యామల, ప్రమీళ, సీపీఎం నాయకుడు మల్లికార్జున పాల్గొన్నారు.


గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఐద్వా సంఘం నాయకులు

ఈకేవైసీ నమోదుకు నేడు ఆఖరు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన పంటలకు ఈ-పంట నమోదు చేసుకున్న రైతులు ఈకేవైసీ నమోదు చేసుకోవడానికి గురువారంతో గడువు ముగుస్తుందని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ అన్నారు. మండల పరిధిలోని యర్రగుంట్ల, కమలాపురం, కొప్పలకొండ గ్రామాల్లో రైతులు ఈ-పంట నమోదు చేసిన వివరాలను బుధవారం ఆమె సందర్శించి తనిఖీ చేశారు. మండల వ్యాప్తంగా 9427మంది రైతులకు గాను 9078 మంది ఈకేవైసీ చేయించుకున్నారన్నారు. మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, వీహెచ్ఏ శిరీష, ఆమని, మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.


పంట నమోదును తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

అక్కరకురాని శుద్ధజల కేంద్రాలు

రూ.కోటికి పైగా ఖర్చు


భాగ్యనగర్‌లో మూలకు చేరిన శుద్ధజల పథకం

గుంతకల్లు, న్యూస్‌టుడే: 2010లో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో మొట్టమొదటిగా గుంతకల్లు మున్సిపాలిటీలో మూడు శుద్ధ జల కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటికి రూ.కోటికి పైగా ఖర్చు చేసి పాతగుంతకల్లు, భాగ్యనగర్, మొదినాబాదు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. నిర్వహణ విషయంలో గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చేయడంతో మూడేళ్ల కిందట మూలకు చేరాయి.

కన్నెత్తి చూడని అధికారులు

మూడు శుద్ధజల పథకాలు పని చేయకపోయినా వాటివైపు పురపాలక అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ఫలితంగా విలువైన సామగ్రి, యంత్రాలు పాడైపోతున్నాయి. కేంద్రాలను డ్వాక్రా సంఘాలకు అప్పగించి చేతులు దులుపుకొన్నారు. మరమ్మతులు చేయడానికి, నిర్వహణకు సంబంధించి అధికారులు నిధులను కేటాయించకపోవడంతో సంఘాల సభ్యులు చేతులెత్తేశారు. మూడు పథకాలను వినియోగంలోకి తెస్తే దాదాపు 40 వేల మందికి శుద్ధజలం అందుతుంది.

వినియోగంలోకి తీసుకొస్తాం - భవానీ, పురపాలక ఛైర్‌పర్సన్

మూలకు చేరిన శుద్ధజల పథకాలను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరముంది. అధికారులతో సమావేశాన్ని నిర్వహించి అవసరమైన నిర్ణయాలు తీసుకుంటాం. పథకాలను బాధ్యులకు అప్పగించి కాలనీల ప్రజలకు శుద్ధజలాన్ని అందించడానికి అన్నివిధాలా చర్యలు చేపడతాం.

పరిశుభ్రతపై చైతన్య ర్యాలీ

గుత్తి, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని పురస్కరించుకుని బుధవారం గుత్తిలో పురపాలిక ఉద్యోగులు, అధికారులు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలతోపాటు డ్వాక్రా మహిళలు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్ అండ్‌బీ అతిథిగృహం నుంచి గాంధీచౌక్ మీదుగా రాజీవ్ సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పురపాలిక అధ్యక్షురాలు వన్నూరుబీ, కమిషనర్ జబ్బార్‌మియా పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు సత్కారం

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: పెద్దవడుగూరు పంచాయతీలో పని చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులను బుధవారం ఎంపీడీవో కుళ్లాయిస్వామి, ఏపీవో పుల్లారెడ్డి, సర్పంచి వరలక్ష్మి పలువురు సన్మానించారు. గ్రామంలోని పలుకాలనీల్లో నెలకొన్న చెత్తను, పూడికతీత పనుల్లో చురుగ్గా పాల్గొన్న కార్మికుల సేవలను గుర్తించి గౌరవించడం విశేషం.

పప్పుశనగ విత్తనాల పంపిణీకి పేర్ల నమోదు

యాడికి, న్యూస్‌టుడే: పప్పుశనగ విత్తనాల పంపిణీ కోసం గురువారం నుంచి రైతుల పేర్ల నమోదు ప్రక్రియ చేపడుతున్నట్లు వ్యవసాయధికారి మహబుబ్‌బాషా తెలిపారు. రబీ సీజన్‌లో పప్పుశనగ పంట సాగు చేయాలనుకున్న రైతులకు ప్రభుత్వం రాయితీతో విత్తనాలు అందిస్తోందన్నారు. దీనికి రైతులు తమ పేర్లను సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ఆధార్‌తో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

మహాత్ముడి ఆశయాలు కొనసాగిద్దాం


బుక్కరాయసముద్రంలో గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంపీపీ సునీత తదితరులు

గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో మహాత్మాగాంధీ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశస్వాంత్ర్య ఉద్యమంలో జాతిపిత పాత్రను ఆయా సభావేదికలపై వక్తలు వివరించారు. ఆయన ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. వీధుల్లో గాంధీ చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు.

-న్యూస్‌టుడే బృందం


గుత్తి : ఉపకారాగారం వద్ద అంజలి ఘటిస్తున్న న్యాయమూర్తి కాశీవిశ్వనాథాచారి,తదితరులు


గుంతకల్లు పట్టణం: గాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఆవోపా సభ్యులు


తాడిపత్రి : మహాత్ముడి నివాళి అర్పిస్తున్న భాజపా నాయకులు

పంచాయతీ ప్రణాళికపై దృష్టి

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకం కింద పంచాయతీలో చేయాల్సిన పనులపై కూలీలు, ప్రజలు దృష్టి సారించాలని ఎంపీడీవో కుళ్లాయిస్వామి పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచి వరలక్ష్మీ అధ్యక్షతన ఉపాధిపనుల ప్రణాళికపై గ్రామ సభను నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కుళ్లాయిస్వామి, ఉపాధి పథక సహాయాధికారి పుల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర, వైద్యుడు శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

నాణ్యమైన తినుబండారాలు అందించండి


బహుమతులు అందుకున్న విద్యార్థులు, కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

గుంతకల్లు, న్యూస్‌టుడే: రైలు ప్రయాణికులకు నాణ్యమైన భోజనాన్ని, తినుబండారాలను అందజేయాలని డీఆర్ఎం విజయకుమార్, ఏడీఆర్ఎం సుధాకర్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని రైల్వేలో గత 15 రోజుల పాటు స్వచ్ఛభారత్ కార్యక్రమాలను నిర్వహించారు. రైల్వే జంక్షన్‌లో బుధవారం ముగింపు కార్యక్రమం జరిగింది. అధికారులు రైల్వే స్టేషన్‌లోని హోటళ్లు, తినుబండారాల దుకాణాలు, రైల్వే స్టేషన్ పరిసరాలను, ప్లాట్‌ఫారాలను తనిఖీచేశారు. రైల్వే ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, స్కౌట్ వలంటీర్లు పరిశుభ్రత అవసరాన్ని తెలుపుతూ నాటిక ప్రదర్శించారు. అనంతరం వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటి కష్టాలు చూడండయ్యా!

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులోని దోనిముక్కల రోడ్డు ఏరియా టిడ్కో నివాస సముదాయం ఎదురుగా ఉండే గుట్ట కాలనీలో ఇళ్ల వద్ద ఇంటింటికీ నీటి డ్రమ్ములు కనిపిస్తుంటాయి. ఈ కాలనీలో కొన్ని కుటుంబాలకు సొంత కుళాయిలు లేవు. మున్సిపాలిటీ అధికారులు ట్యాంకర్ల సాయంతో తాగునీరును సరఫరా చేస్తున్నారు. ఇక్కడి నీటి డ్రమ్ము నీటి కష్టాలకు నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తున్నాయి.


ఇళ్ల వద్ద నీటి డ్రమ్ములు

ఇదేనా.. మొక్కల పరిరక్షణ?

గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఇది వరకు వైద్యులు ఆవరణలో మొక్కలు నాటారు. వాటిని సంరక్షించకపోవడంతో వాటి చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఆసుపత్రి ఆవరణ అపరిశుభ్రంగా ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగించి నాటిన మొక్కలను సంరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, గార్లదిన్నె గ్రామీణం



ఎంపీడీఓకు సేవా పురస్కారం


ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న ఎమ్పీడీవో నిర్మలకుమారి

శింగనమల, న్యూస్‌టుడే: శింగనమల మండలంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఎమ్పీడీవో నిర్మలకుమారిని బుధవారం సత్కరించారు. రాప్తాడు మండలం కక్కలపల్లిలో రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే పరిటాల సునీత, కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రశంసా పత్రాన్ని అందించారు. 15 రోజుల పాటు స్వచ్ఛతా హీ సేవాను నిర్వహించినందుకు పురస్కారం దక్కింది.

ఇంటికి కన్నం వేసే దొంగల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామకృష్ణుడు

తాడిపత్రి, న్యూస్‌టుడే: జల్సాలకు అలవాటు పడి గత కొంత కాలంగా దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తి, అతనికి సాయం అందించిన మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రామకృష్ణుడు పేర్కొన్నారు. బుధవారం తాడిపత్రి గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇగుడూరు గ్రామానికి దాసరి నరేంద్ర అనే వ్యక్తి గొర్రెల కాపరిగా ఉంటూ జీవనం సాగించేవాడని, గత కొంతకాలంగా మద్యం, జూదానికి అలవాటు పడ్డాడు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు దొంగతనాలకు అలవాటు పడ్డాడు. తాళం వేసిన ఇళ్లను ఎంచుకుని దొంగతనాలకు పాల్పడేవాడు. దొంగిలించిన నగలను కడప జిల్లా కొండాపురం మండలం యనమల చింతల గ్రామానికి చెందిన తన మేనమామ భైరవుడికి ఇచ్చేవాడు. అతను అల్లుడిని నమ్మి నగదు అమ్మి డబ్బులిచ్చేవాడు. పోలీసులు విచారించి రూ. 2,50,000 విలువ చేసే బంగా ఆభరణాలు, రూ. 95వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సీఐ శివగంగాధర్‌రెడ్డి, ఎస్సై కాటయ్య, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

లోకో రన్నింగ్ సిబ్బంది ధర్నా

గుంతకల్లు, న్యూస్‌టుడే: గుంతకల్లు రైల్వే డివిజన్‌లో పనిచేస్తున్న లోకోరన్నింగ్ సిబ్బంది డ్రైవర్లు, సహాయ డ్రైవర్ల సమస్యలను తీర్చడానికి అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని రైల్వే మజ్దూర్ యూనియన్‌లో భాగమైన లోకోరన్నింగ్ విభాగం కార్యదర్శి ఎస్.ఎం. బాషా అన్నారు. సిబ్బంది సమస్యలను పరిష్కరించాలంటూ సిబ్బంది బుధవారం రైల్వే జంక్షన్‌లోని క్రూకంట్రోల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈకార్యక్రమంలో లోకోరన్నింగ్ మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ కోశాధికారి నరేశ్, కార్యవర్గ సభ్యులు నాగేంద్ర, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

రహదారులు.. నెత్తుటేరులు

➤ నెలరోజుల్లో ఆరుగురి దుర్మరణం
➤ నిర్లక్ష్యంగా పోలీసులు


ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు

బుక్కరాయసముద్రం, నార్పల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని జాతీయ, రాష్ట్ర రహదారులు నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారాయి. రహదారుల్లో మద్యం తాగా వాహనాలు నడపడం కారణంగా నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పోలీసులు రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తగిన కార్యాచరణ రూపొందించక పోవడంతో ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గడచిన నెల రోజుల్లోనే బుక్కరాయసముద్రం మండల పరిధిలో జరిగిన వివిధ రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృత్యువాత పడ్డారు. మరో 10 మందికి పైగా గాయాల పాలయ్యారు.

ప్రమాదాలు ఎక్కడెక్కడంటే..

హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిలో గుత్తిరోడ్డు, వడియంపేట, బి.కొత్తపల్లి తాడిపత్రి వైపు వెళ్లే జాతీయ రహదారిలో కొర్రపాడు, రెడ్డిపల్లి, నార్పల వైపు వెళ్లే రహదారిలో దయ్యాలకుంటపల్లి, రేకులకుంట, వెంకటాపురం గ్రామాల శివార్లలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

✦ తాజాగా రేకులకుంట వద్ద జరిగిన కారు ప్రమాదంలో ఏకంగా నలుగురు యువకులు మృత్యువాత పడటం జిల్లాలో సంచలనంగా మారింది.

✦ వడియంపేట దగ్గర ఒకరు, రెడ్డిపల్లి వద్ద మరొకరు ప్రమాదాల్లో మృతి చెందారు. ఈ ప్రమాదాలకు ప్రధాన కారణంగా మద్యం తాగి వాహనాలు నడపడమేనని తెలుస్తోంది.

✦ బుక్కరాయసముద్రం మండల కేంద్రంతో పాటు, రేకులకుంట వద్ద వెలసిన చికెన్ విక్రయ కేంద్రాలు వెలిశాయి. గ్రామాల నుంచి ఉపాధి కోసం రోజూ అనంతపురానికి వెళ్లే రోజువారి కూలీలు పనులు ముగించుకుని ఈ చికెన్ దుకాణాల్లో మద్యం తాగి ద్విచక్రవాహనాలు నడపడం మూలంగానే తరచూ వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి.

మామూళ్ల వసూలుపైనే ఖాకీల దృష్టి

రోడ్డు ప్రమాదాలు జరిగి వాహన చోదకులు, ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నా పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణకు చొరవ చూపడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చికెన్ దుకాణాల్లో మద్యం తాగుతున్నా పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కొందరు పోలీసులు ఆయా దుకాణాల నుంచి మామూళ్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

✦ ఎర్రమట్టి, ఇసుక రవాణా ట్రాక్టర్లను వెంబడించడం వాటిని స్టేషన్‌కు తీసుకురాకుండానే మధ్యలో డ్రైవర్లతో మామూళ్లు తీసుకుని వదిలేస్తున్నారనే విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. పోలీస్ స్టేషన్‌లో కేంద్రంగానే ఇదంతా జరుగుతోందని తెలుస్తోంది. దీనిపై అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లుని వివరణ కోరగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామన్నారు. క్రమశిక్షణ తప్పుతున్న పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

సంఘం గుర్తింపు పునరుద్ధరించాలి



అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందిస్తున్న తపాలాశాఖ ఉద్యోగులు

అరవిందనగర్ (అనంతపురం): ఎన్ఎఫ్‌పీఈ (నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్), అనుబంధ సంఘం గుర్తింపు పునరుద్ధరించాలని తపాలాశాఖ అనంతపురం డివిజన్ సంఘం నాయకులు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు విజ్ఞప్తి చేశారు. పరిష్కారానికి హామీ ఇచ్చారని అఖిల భారత తపాలా ఉద్యోగులు, గ్రామీణ డాక్ సేవక్ సంఘాల నాయకులు పేర్కొన్నారు.

బదిలీపై ఉద్యోగులకు సన్మానం



రాప్తాడు ఎంపీడీవోను సన్మానిస్తున్న ఉద్యోగులు

రాప్తాడు, న్యూస్‌టుడే: రాప్తాడు ఎంపీడీవో కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఆ ఉద్యోగులను పూలమాల, శాలువాతో మనగాం సహచర ఉద్యోగులు సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. రాప్తాడు ఎంపీడీవో సల్మాన్‌రాజ్, ఏవో రత్నబాయ్, ఈవోఆర్డీ నరసింహారెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ ఓబుళదాస్, ట్రైనీ రాజశేఖర్‌లను సన్మానించారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

అరవిందనగర్: భారతీయ జీవిత బీమా శాఖ-2 కార్యాలయంలో భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య(లియాఫీ) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శాఖ మేనేజర్ భరత్, సహాయ మేనేజర్ మమత లియాఫీ జెండాను ఆవిష్కరించారు. ఎల్ఐసీ సంఘం అధ్యక్షుడు ఆదిశేషయ్య, ప్రధాన కార్యదర్శి జగదీశ్, వెంకటనారాయణ, నారాయణ స్వామి పాల్గొన్నారు. జీవిత బీమా అగ్రస్థానంలో నిలవడానికి ఉద్యోగులు, ఏజెంట్ల కృషి కారణమని ఎల్ఐసీ శాఖ-1 మేనేజర్ మధుబాబు పేర్కొన్నారు.

జూదరుల అరెస్టు

అనంత నేరవార్తలు: అనంతపురం నగర శివారులోని బళ్లారి రోడ్డులో జూదగ్రహంపై గ్రామీణం పోలీసులు బుధవారం దాడి చేసి రూ.1.25 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. అంజనేయనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటిలో జూదమాడుతుండగా దాడులు నిర్వహించి 10 మంది జూదరులను పోలీసులు పట్టుకున్నారు.

తెరపై ఈనాడు

కమలానగర్: గంగ : సత్యం సుందరం, గౌరి, గాయత్రి, గౌతమి, త్రివేణి, ఎస్వీ సినిమాక్స్, నీలిమ, సుధా : దేవర, తరంగిణి : జోకర్, తేజస్విని : మత్తు వదలరా-2.

శుభ్రత లేని గదుల్లో వంటా వార్పు

న్యూస్‌టుడే: అరవిందనగర్ (అనంతపురం)

నగర శివార్లలో, జాతీయ రహదారికి ఇరువైపులా దాబాలు, హోటళ్లు, తోపుడు బండ్లు విపరీతంగా పెరిగాయి. చికెన్, మటన్, ఫాస్ట్‌ఫుడ్ జోరుగా సాగుతున్నాయి. వీటిపై సరైన పర్యవేక్షణ లేక నాణ్యత లేని ఆహార పదార్థాలను వండి వారుస్తున్నారు. కొందరు దాబా నిర్వాహకులు చికెన్, మటన్ పకోడీలు, గోబీ వంటల్లో కాలం చెల్లిన సోయా సాస్ వాడుతూ వాడుతున్నారు. గాలి, వెలుతురు లేని, బూజు పట్టిన వంట గదుల్లో వంటావార్పు సాగిస్తున్నారు. నాసిరకం ఉప్పిరాయలు, బంగాళాదుంపలు, మిరపకాయలు వాడుతున్నారు. ఎక్కువ రోజులు శీతల పెట్టెల్లో చికెన్, మటన్ నిల్వచేస్తున్నారు. కొన్ని వంటల్లో నాణ్యత లేని పెరుగును వినియోగిస్తున్నారు. ఒకసారి వంటనూనెనే మళ్లీ మళ్లీ వాడుతున్నారు. ఆక స్మిక తనిఖీలో దాబాలు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో లోపాలు వెలుగు చూశాయి.

నిబంధనలు ఇవీ..

శాకాహారం, మాంసాహారాలను శీతల పెట్టెల్లో వేర్వేరుగా, మూత కలిగిన పాత్రల్లో నిల్వ ఉంచాలి. చికెన్, తదితర ఆహార పదార్థాలు కొనుగోలుకు సంబంధించి బిల్లులు (రసీదు) ఉండాలి. సమోసా, తదితర వంటలను ప్లాస్టిక్ బకెట్‌లో నిల్వ చేయరాదు. సరఫరా కోసం ఫుడ్ గ్రేయిన్ కంటైనర్లు వినియోగించాలి. వంటలకు ఒకసారి వాడిన నూనెను మళ్లీ మళ్లీ వాడరాదు. వినియోగిస్తున్న రంగులు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) గుర్తింపు కలిగిన రంగులే ఉండాలి. అది కూడా మోతాదుకు మించి (100 పీపీఎం.. పార్ట్స్‌పర్ మిలియన్) మించకూడదు. రంగుల మోతాదు వందకు పైగా మించితే క్యాన్సర్ తదితర అనారోగ్యానికి గురవుతారు. వంట గదుల్లో శుచి, శుభ్రత, గాలి వెలుతురు, పరిశుభ్ర వాతావరణం ఉండాల్సిందే.

14 నమూనాల్లో లోపాలు

అనంతపురం జిల్లాలో దాబాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో 15 రోజులుగా చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో 100 (వంద) ఆహార పదార్థాల నమూనాలు సేకరించి, నాణ్యత పరీక్షకు పంపించగా అందులో 14 నమూనాలు ఫెయిల్ అయ్యాయి. శుచి, శుభ్రత మెరుగు పరచుకోవాలని, పరిశుభ్ర వాతావరణంలో తయారు చేయాలని, సరఫరా కోసం ఫుడ్ కంటైనర్లు వినియోగించాలని హెచ్చరికలు జారీ చేశాం. నాణ్యత పరీక్షల్లో ఫెయిల్ అయిన నమూనాల్లో నాసిరకం పదార్థాలను వినియోగించిన వ్యాపారులపై కేసులు నమోదు చేశాం. తదుపరి విచారణకు జిల్లా కోర్టుకు పంపిస్తాం.

- ఫుడ్‌సేఫ్టీ, అసిస్టెంట్ కంట్రోలర్ చక్రవర్తి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తస్లీమ్

అతిక్రమణ యథేచ్ఛగా..

అనంతపురం నాలుగో రోడ్డులోని సమోసా తయారీ కేంద్ర నిర్వాహకులు అపరిశుభ్ర వాతావరణం, గాలి, వెలుతురు లేని, బూజు పట్టిన వంట గదిలో తయారు చేస్తున్న తీరు వెలుగుచూసింది. నగరంలోని మిఠాయి దుకాణాల్లో జాంగ్రీల తయారీలో మోతాదుకు మించి రంగులు కలుపుతున్న తీరు గుర్తించారు. గుత్తిలో దాబా నిర్వాహకులు ఒకరు బిర్యానీ వంటకు కాలం చెల్లిన సోయా సాస్ వినియోగిస్తున్న తీరు వెలుగుచూసింది.

- నగరం, కోర్టు రోడ్డు సూరి హోటల్‌లో బిర్యానీ తయారీకి వాడే రంగు హానికరం అని తేలింది.
- పాతూరు.. వెంకటేశ్వర ట్రేడర్స్‌లో వక్కలకు మోతాదుకు మించి వినియోగించిన రంగు హానికరమైనదని గుర్తించారు. విద్యుత్తు దీప కాంతులతో మిరు...
- శ్రీకంఠం కూడలి వద్ద రెస్టారెంట్‌లో నాసిరకం పెరుగు వినియోగిస్తున్నట్లు గుర్తించారు.



నాలుగో రోడ్డులో సమోసా తయారీ కేంద్రంలో పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి తస్లీమ్



సాయినగర్‌లో బోరు మరమ్మతులు చేయడంతో వస్తున్న నీరు

బోర్లు మరమ్మతు చేసి గొంతు తడిపారు

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నగరంలోని పలు ప్రాంతాల్లో నగరపాలక తాగునీటి ఇంజినీరింగ్ విభాగం అధికారులు పవర్ బోర్లు మరమ్మతులు చేశారు. ఈ నెల 1న నీరందక బోరు మంచినీరు శీర్షికన ఈనాడులో ప్రచురితమైన చిత్ర కథనానికి స్పందించిన అధికారులు సాయినగర్‌లో రెండు బోర్లు మరమ్మతులు చేశారు. ప్రకాశ్ రోడ్డులో మరమ్మతుల పనులు ప్రారంభించారు. మరి కొన్ని ప్రాంతాల్లో చిన్న చిన్న సమస్యలకు పనులు చేయకుండా వాటి నుంచి నీరు అందే విధంగా చర్యలు చేపట్టారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)

అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005, రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

సమస్య: 4వ రోడ్డు కొండపై తోటలో ఆరు రోజుల నుంచి వ్యాన్ రాక చెత్త పేరుకుని పోయింది. - అల్తాఫ్

సమాధానం: క్లాప్ ఆటో వెంటనే పంపి చెత్తను తీసుకెళ్లే విధంగా చర్యలు చేపడతాం.

సమస్య: ఆర్టీసీ సమీపంలోని విన్సెంట్ ఫెర్రర్‌నగర్ ఏడో క్రాస్‌లో చెట్టు కొమ్మలు ప్రధాన లైను, సర్వీసు లైను మీద ఉన్నాయి. - రాజు

సమాధానం: వెంటనే కొమ్మలను తొలగిస్తాం.

సమస్య: టిడ్కో ఇళ్లకు రూ.25 వేలు కట్టాం. ప్లాటు ఇవ్వలేదు, సొమ్ము వెనక్కి ఇవ్వలేదు. - శేషసాయిరాజు

సమాధానం: ప్రభుత్వం నుంచి నిర్ణయం రాగానే చర్యలు చేపడతాం.

పై ప్రశ్నలకు నగరపాలక ప్రజారోగ్య అధికారి విష్ణుమూర్తి, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సమాధానాలు ఇచ్చారు.

- న్యూస్‌టుడే, అనంత నగరపాలక

అల్లుకున్న తీగలు తొలగించారు

అనంతపురం(గుల్జార్‌పేట), న్యూస్‌టుడే: నగరంలోని అరవిందనగర్‌లో చర్చికి వెళ్లే దారిలో నియంత్రికకు తీగలు ప్రమాదంగా అల్లుకున్నాయి. గాలి వీచిన ప్పుడు నియంత్రిక నుంచి నిప్పు రవ్వలు వచ్చేవి. దీంతో సెప్టెంబర్ 30న ఈనాడులో అల్లుకున్న తీగలు.. గాలి వీస్తే నిప్పురవ్వలు అనే శీర్షికన వార్త రావటంతో విద్యుత్తు అధికారులు స్పందించారు. అల్లుకున్న తీగలను తొలగించారు.

శరన్నవ శోభితం

శివకోటి-శ్రీపీఠంలో దసరా సంబరం

బెంగళూరు రోడ్డులో ఉన్న శివకోటి శ్రీపీఠంలో దసరా సంబరాల్లో భాగంగా శరన్నవ రాత్రుల విశేష అలంకారాలు, పూజలు ఉంటాయి. 3న అన్నపూర్ణాదేవి, 4న మహేశ్వరి దేవి, 5న వైష్ణవి దేవి, 6న వారాహిదేవి, 7న ఐద్రీదేవి, 8న రాజశ్యామలాదేవి, 9న సరస్వతి దేవి, 10న దుర్గాష్టమి సందర్భంగా మహాలక్ష్మీదేవి, 11న దుర్గాదేవి, 12న విజయ దశమి సందర్భంగా అపరాజితదేవి అలంకారంలో శివకామసుందరి, శివకామేశ్వరి రూపాలతో అలంకరిస్తారు.



లలిత శివకామేశ్వరి

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరానికి శరన్నవ రాత్రుల శోభ సంతరించుకుంది. పలు ఆలయాలను దసరా పండుగకు ముస్తాబు చేశారు. విద్యుత్తు దీప కాంతులతో మిరుమిట్లు గొలుపుతున్నాయి. గురువారం నుంచి శరన్నవ రాత్రులు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 13 వరకు పలు రూపాల్లో అలంకారాలతో దేవతామూర్తులు దర్శనం ఇస్తారు. మరోవైపు బుధవారమే పెద్ద పండుగకు దుస్తులు కొనుగోలు చేసుకున్నారు. అనంతపురం నగరం పలు ఆలయాలలోని దేవతామూర్తులకు రోజుకో అలంకారం చేయడంతో భక్తులు తన్మయత్వం చెందుతారు. ఆలయ ప్రాంగణం నుంచి పీఠ అంతా విద్యుత్తు దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. అనంతపురం నగరంలోని పాతూరు బ్రహ్మంగారి ఆలయం, యల్లమ్మ దేవాలయం, కన్యకాపరమేశ్వరి దేవాలయం, మల్లాలమ్మ ఆలయం, శివకోటి, శివబాలయోగి ఆశ్రమం, శారదానగర్, హౌసింగ్ బోర్డు వెంకటేశ్వర ఆలయం, అశోక్‌నగర్ రామ సమేత సత్యనారాయణస్వామి ఆలయం, సూర్యనగర్ రోడ్డులోని మల్లాలమ్మ, కొత్తూరు అమ్మవారిశాల, రైల్వే పీడరు రోడ్డులోని వెంకటేశ్వర ఆలయం, మొదటి రోడ్డులోని శివాలయం, హెచ్ఎల్‌సీ కాలనీలో ముత్యాలమ్మ ఆలయంతో పాటు మిగతా ఆలయాల్లో శరన్నవ రాత్రుల వేడుకలు నిర్వహించేందుకు ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

కొత్తూరు కన్యకాపరమేశ్వరి



కొత్తూరు కన్యకాపరమేశ్వరిదేవి మూల విగ్రహానికి, ఉత్సవ విగ్రహాలను అలంకరిస్తారు. 3న కాశీ విశాలాక్షి, అన్నపూర్ణాదేవి, శివుడు, మధుర మీనాక్షి, 4న భగవతి దేవి, నవశక్తి, వెంకటేశ్వరుడు, 5న కొల్హాపూర్ మహాలక్ష్మి దేవి, లక్ష్మీనారాయణ, ఆంజనేయ, గరుడ, 6న లలిత త్రిపుర సుందరీదేవి, సరస్వతి దేవి, 7న శైలపుత్రీదేవి, గాయత్రీదేవి, సిద్ధిదాత్రి దేవి, 8న కంచి కామాక్షిదేవి, వాసవీదేవి, సంతోషీమాత దేవి, 9న అర్ధనారీశ్వరుడు, సరస్వతి దేవి, బ్రహ్మ, లక్ష్మీనారాయణులు, 10న మధురవీరన్, నాగదేవత, 11న భువనేశ్వరీదేవి, మహిషాసురమర్దని దేవి, 12న వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి దర్బార్,13న శయనోత్సవ అలంకారం ఉంటుంది.

తిరుమల తరహాలో..



ఆర్ఫ్ రోడ్డులో శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం విద్యుత్‌కాంతులు

రైల్వేఫీడరు రోడ్డులో ఉన్న శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో తిరుమల తరహాలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించారు. 3న శేషవాహనం, 4న హంసవాహనం, 5న సింహవాహనం, 6న సర్వభూపాలవాహనం, 7న గరుడ వాహనం, 8న హనుమద్వాహనం, 9న గజవాహనం, 10న చంద్రప్రభవాహనం, 11న అశ్వవాహనం మీద శ్రీవారి పురవీధుల్లో ఊరేగింపు ఉంటుంది. 12న రథోత్సవం, 13న చక్రస్నానం ఉంటుంది.



పాతూరులో అలంకారాలు

పాతూరు కన్యకాపరమేశ్వరికి 3న వారాహిదేవి, 4న బాల త్రిపుర సుందరి, 5న అన్నపూర్ణాదేవి, 6న తోటోత్సవము వనమహోత్సవం, 7న గజలక్ష్మీదేవి, 8న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, 9న సరస్వతి, 10న మహిషాసుర మర్దని, 11న గంగా సమేత శివపార్వతులు, 12న సప్త మాతృకలు, 13న శయనోత్సవ అలంకారాలతో అమ్మవారు దర్శనం ఇస్తారు.

కన్యకాపరమేశ్వరి దేవి





పాతూరు శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం

మూడు రోజులుగా తొలగని చెత్త



అనంతపురం నగరం రెండో రోడ్డులో స్థానిక మైత్రి హోటల్ కూడలి వద్ద మున్సిపల్ కార్పొరేషన్ కుండీలు ఉంచింది. మూడు రోజులుగా చెత్తను తొలగించలేదు. స్థానికులు తడి, పొడి చెత్తలను రోడ్డుపైనే పారబోశారు. రోడ్డు అపరిశుభ్రంగా మారింది. కుళ్లిన పదార్థాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. చెత్తపై పశువులు, కుక్కలు, పందులు సంచరిస్తూ మరింత అపరిశుభ్రం చేస్తున్నాయి.

- న్యూస్‌టుడే, ఆజాద్‌నగర్

ప్రమాదకరంగా కల్వర్టు



అరవిందనగర్‌లోని మాజీ మేయర్ ఇంటి సమీపంలో కల్వర్టు మరమ్మతులకు చేరింది. దీంతో నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రిళ్లు ఎక్కువ మొత్తంలో ప్రమాదాల బారిన పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కల్వర్టు మరమ్మతు చేరి మురుగు నీరు అస్తవ్యస్తంగా పారుతోంది. దుర్వాసనతో దోమలు వ్యాప్తి చెంది రోగాలు వస్తున్నాయని వాపోతున్నారు.

- న్యూస్‌టుడే, అనంతపురం(గుల్జార్‌పేట)

ట్రాఫిక్ పోలీసు లేకుండా నియంత్రణ ఎలా?



కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డులో నిత్యం వాహనాలు అస్తవ్యస్తంగా వెళ్తున్నా చర్యలు చేపట్టడం లేదు. దీంతో అక్కడ నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రద్దీగా ఉన్న ప్రాంతంలో ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినా అక్కడ విధులు నిర్వహించటానికి పోలీసును ఏర్పాటు చేయలేదు. వాహనాలు ఇష్టానుసారంగా వస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

- న్యూస్‌టుడే, అనంతపురం(కమలానగర్)


'మద్యాన్ని నియంత్రించాలి'

ఆజాద్‌నగర్, న్యూస్‌టుడే: సంపూర్ణ మద్య నిషేధం చేసే మహాత్ముని కలలకు సాకారం చేకూరినట్లు అవుతుందని మహిళా సంఘాల ఐక్యవేదిక మహిళలు పేర్కొన్నారు. వారు గాంధీజీ 155వ జయంతిని పురస్కరించుకుని మద్యాన్ని నియంత్రించాలని బుధవారం గడియార స్తంభం సమీపాన గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఐక్యవేదిక నాయకురాలు సావిత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్త మద్యం విధానంతో మునుపటి కంటే అధికంగా ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం దురదృష్టకరమన్నారు. అనంతపురం జిల్లాలో 136 దుకాణాలు ఏర్పాటు కానున్నాయని, గతంలో రాత్రి 8 గంటలకే దుకాణాలు మూసివేసే వారని, ఇప్పుడు రాత్రి 10 గంటల వరకూ తెరిచి ఉంచాలని నిర్ణయించడం సిగ్గుచేటని విమర్శించారు.

చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: 4 నెలల చిన్నారికి అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా చేసినట్లు కిమ్స్ సవీరా చిన్నపిల్లల వైద్యుడు మహేష్ బుధవారం వెల్లడించారు. అనంతపురానికి చెందిన చిన్నారి (బాబు) తండ్రి పూర్ణిగా అందుడు. తల్లికి కూడా 50 శాతం పైగా అందురాలు కావటంతో వారికి పుట్టిన బిడ్డకు ఆయాసం ఉన్నట్లు గుర్తించలేకపోయారని వివరించారు. బాబు పుట్టిన 4 నెలల తరువాత తీవ్ర ఆయాసం రావటం, పాలు కూడా తాగలేకపోతుండటంతో బంధువులు సమస్యను గుర్తించి తెలిపారు. దీంతో సవీరా ఆసుపత్రికి తీసుకువచ్చారని, బాబుకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా పొట్టలో ఉండాల్సిన కొన్ని ముఖ్యమైన అవయవాలు ఊపిరితిత్తుల స్థానంలో ఉన్నట్లు గుర్తించి శస్త్రచికిత్స ద్వారా అవయవాలను ఉండాల్సిన చోటుకు మార్చినట్లు వైద్యులు తెలిపారు.

వరద బాధితులకు చేయూత



మంత్రి లోకేశ్‌కు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం(కళ్యాణదుర్గంరోడ్డు): విజయవాడ వరద బాధితులకు అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో పలు వర్గాల ప్రజలు సాయం అందించేందుకు ముందుకొచ్చారు. వివిధ వర్గాల నుంచి వసూలైన మొత్తం రూ.11,28,100ను బుధవారం మంగళగిరిలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మంత్రి లోకేశ్‌ను కలిసి చెక్కు అందజేశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చొరవ చూపి వరద బాధితులకు అండగా నిలవడం పట్ల లోకేశ్ అభినందించారు. అనంతపురం అనంతపురం అర్బన్‌లో డంపింగ్ యార్డు తరలింపు, భూగర్భ కాలువ నిర్మాణంపై లోకేశ్‌తో ఎమ్మెల్యే చర్చించారు. త్వరలో పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని తెలియజేశారు.

ముంపు నుంచి కాపాడండి

అనంతపురం(వ్యవసాయం): అనంతపురం గ్రామీణం కక్కలపల్లి కాలనీ పంచాయతీ జాకీర్‌కొట్టాల, సుందరయ్య కాలనీ, దండోరా కాలనీ, నారాయణరెడ్డికాలనీ, అదర్శనగర్, గౌడుగు మునుస్వామి కాలనీ, గొరవ హౌస్లింగ్ కాలనీలో మురుగు కాలువ పొడవుగా 2 వేల ఇళ్లున్నాయి. వైకాపా ప్రభుత్వం హయాంలో మంగళగిరి ఆర్కెట్ యార్డు చేరి భారీగా నష్టం జరిగిందని, ఇకపై వరద ముంపునకు గురికాకుండా చూడాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. కలెక్టర్ వినోద్‌కుమార్, ఎంపీ బీకే పార్థసారథితో కలిసి బుధవారం జాకీర్ కొట్టాల్లోని వంకను పరిశీలించారు. రక్షణ గోడ నిర్మాణానికి అంచనా తయారు చేసి నివేదికను అందజేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



జాకీర్ కొట్టాల్లోని మురుగు కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే పరిటాల సునీత



మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ జగదీశ్



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ బి.గిరిజమ్మ, సీఈవో ఓబులమ్మ



గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న జిల్లా తెదేపా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, నాయకులు

గాంధీ బాటలో నడుద్దాం

భారతదేశానికి స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ ఆచరించిన అహింసా మార్గం, సత్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకం అని పలువురు కొనియాడారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని రాప్తాడు, అనంతపురం నియోజకవర్గాల పరిధిలో పలు కార్యక్రమాలు నిర్వహించారు.

- అనంత వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో తెదేపా నాయకులు, అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు, ఉద్యోగులు, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి విష్ణుప్రియ, అనంతపురం ఉప రవాణాశాఖ కార్యాలయం ఆవరణలో డీటీసీ వీర్రాజు, ఆర్టీవో సురేష్ నాయుడు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు చేపట్టారు.
- పోలీసు కార్యాలయంలో ఎస్పీ జగదీశ్,

ఎస్కేయూలో ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అనిత, జేఎన్‌టీయూలో ఇన్‌ఛార్జి వీసీ సుదర్శనరావు, అనంత జిల్లా తెదేపా కార్యాలయంలో అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజనాథ్, వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంతవెంకట్రామిరెడ్డి, మేయర్ వసీం మహాత్మాగాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పించారు.

- న్యూస్‌టుడే, అనంత నగరపాలక, రైల్వే, వైద్యం, వ్యవసాయం, ఆజాద్‌నగర్, రాప్తాడు, ఎస్కేయూ, కళ్యాణదుర్గం రోడ్డు, ఆత్మకూరు



ఎస్కేయూలో మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న ఇన్‌ఛార్జి వీసీ అనిత తదితరులు



చీపురు చేతబట్టి చెత్తను ఊడుస్తున్న డీటీసీ వీర్రాజు, ఆర్టీవో సురేష్‌నాయుడు



తెలుగుతల్లి విగ్రహాన్ని నీటితో శుభ్రం చేస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు